


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | సోమవారం 02-06-2025 | సంపుటి - 24 | సంచిక -31 | రూ : 4 | పేజీలు: 8





# ముస్లిం ఓట్ల కోసమే సిందూర్‌పై మమత వ్యతిరేకత

(మొదటిపేజీ తరువాయి)

ముర్శిదాబాద్‌లో మతపరమైన అల్లర్లు రాష్ట్ర ప్రాయోజితమని, తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన అనేకమంది సీనియర్ నాయకులు వాటిలో పాల్గొన్నారని ఆరోపించారు. ఆ అల్లర్లను ఎదుర్కొనేందుకు సరిహద్దు భద్రత దళాన్ని పంపిస్తామంటే తృణమూల్ సర్కారు అంగీకరించలేదని, వారు వచ్చి ఉంటే హిందువుల్ని కాపాడటం వీలయ్యేదని చెప్పారు. ఆదివారం కోల్‌కతాలో భాజపా నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు.

**సిందూరం విలువ అర్థమయ్యేలా చెప్పండి**

''ఆపరేషన్ సిందూర్‌ను వ్యతిరేకించడం ద్వారా స్థాయి దిగజార్చుకుని మమత మనదేశ మాతృమూర్తుల్ని, సోదరీమణుల్ని అవమానిస్తున్నారు. ఆమె కోట్లమంది ఆడబిడ్డల భావోద్వేగాలను కించపరిచారు. సిందూరానికి ఉన్న విలువేమిటో ఇలాంటివారికి అర్థమయ్యేలా చెప్పండి. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర ఆడబిడ్డలు ముఖ్యమంత్రికి, తృణమూల్ కాంగ్రెస్‌కు గుణపాఠం నేర్పిస్తారు. బంగ్లాదేశ్ చొరబాటుదారుల కోసం సరిహద్దుల్ని మమత తెరిచి ఉంచారు. దేశ భద్రతతో ముడిపడిన తదుపరి ఎన్నికల్లో రాష్ట్ర సర్కారును కూకటివేళ్లతో పెకిలించడానికి భాజపా శ్రేణులు పాటుపడాలి. బెంగాల్‌లో రాబోయేది భాజపా ప్రభుత్వమే. హింసాత్మక మార్గంలో వెళ్లకుండా ఎన్నికల్లో డిపాజిట్లను దక్కించుకోవడం మమతకు కూడా కష్టం. ఆమె అధికారంలోకి వచ్చాక.. బెంగాల్‌ను అక్రమ చొరబాట్లు, నేరాలు, అవినీతి, అత్యాచారాలు, దాడులకు అడ్డాగా మార్చారు. వందలమంది భాజపా కార్యకర్తలు హత్యకు గురయ్యారు'' అని అమిత్ షా చెప్పారు. సరిహద్దు భద్రత దళం (బీఎస్ఎఫ్) కోసం అవసరమైన భూమిని బెంగాల్ సర్కారు కేటాయిస్తే చొరబాట్లను అడ్డుకుంటామని చెప్పారు. అక్రమ చొరబాట్ల ద్వారానే తృణమూల్ పార్టీ అధికారంలో ఉంటోందని, అందుకనే భూమిని కేటాయించడం లేదని ఆరోపించారు.

**రూ.2,800 కోట్లతో ఫోరెన్సిక్ ల్యాబ్‌ల ఆధునికీకరణ**

దేశంలో ఫోరెన్సిక్ ప్రయోగశాలల ఆధునికీకరణ, మౌలిక సదుపాయాల కల్పనకు రూ.2,800 కోట్లు వెచ్చించాలని కేంద్రం యోచిస్తున్నట్లు అమిత్ షా చెప్పారు. కేసులను ఛేదించడంలో ఈ ల్యాబ్‌లు అందిస్తున్న సేవలు విలువైనవని కొనియాడారు. కోల్‌కతా శివార్లలో కేంద్ర ఫోరెన్సిక్ సైన్స్ ప్రయోగశాలను ఆయన ప్రారంభించారు. పేదలకు సత్వర న్యాయం జరగడానికి, కేసులలో అమాయకులు బలికాకుండా చూడడానికి నేరశిక్షా స్మృతుల్లో మార్పులు చేసినట్లు తెలిపారు.

# అమరావతి నవ నగరాల్లో బస్టాండ్లు, డిపోలు

(మొదటిపేజీ తరువాయి)

వైపు నుంచి వచ్చే బస్సుల కోసం ఇంకొటి కలిపి మొత్తం మూడు టెర్మినల్స్ అవసరమని అంచనా వేశారు. అమరావతికి మూడు వైపుల దూర ప్రాంతాల నుంచి వచ్చే బస్సులు.. రాజధాని లోపలి వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండా టెర్మినల్స్ అందుబాటులోకి తీసుకొస్తారు. ఇక్కడి నుంచి సిటీ బస్సుల్లో రాకపోకలు సాగించేలా చూస్తారు. ఒక్కో టెర్మినల్‌కు 25 ఎకరాలు చొప్పున మూడింటికి కలిపి 75 ఎకరాలు అవసరమని అంచనా వేశారు. మొత్తంగా నవ నగరాల్లోని బస్టాండ్లు, డిపోలు, మూడు ఇంటర్‌ఛేంజ్ టెర్మినల్స్‌కు కలిపి 165 ఎకరాలు కోరనున్నారు. ఈ మేరకు రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సీఆర్‌డీఏ)కు లేఖ రాయడంతోపాటు, ఈ విజ్ఞప్తిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఆర్టీసీ యాజమాన్యం సిద్ధమైంది.

# రాష్ట్రంలో సైబర్ దోపిడీలు తగ్గాయి!



(మొదటిపేజీ తరువాయి)

- నెలలతో పోలిస్తే.. ఈ ఏడాది మొదటి నాలుగు నెలల్లో ప్రజలు
- కోల్పోయిన మొత్తం 30 శాతం తగ్గింది.
- 2024 మొదటి నాలుగు నెలలతో పోలిస్తే.. ప్రజలు పోగొట్టుకున్న డబ్బు తిరిగి రాబట్టడం (రికవరీ) ఈ ఏడాది 13 శాతం పెరిగింది.
- 1930కి వచ్చిన ఫిర్యాదును స్వీకరించి స్పందించే సమయం 67 నిమిషాల నుంచి 3 నిమిషాలకు తగ్గింది. దీంతో.. సైబర్ నేరగాడు బాధితుడి ఖాతా నుంచి తన ఖాతాలోకి మళ్లించిన డబ్బును తీసుకునే లోపే ఆ లావాదేవీ నిలిపివేయడం సాధ్యమవుతోంది. దీంతో రికవరీ మెరుగుపడుతోంది.
- అరెస్టయిన నిందితుల సంఖ్య 230 నుంచి 626కి పెరగగా.. పీటీ వారెంట్లూ 53 నుంచి 89కి చేరాయి.
- గతేడాది మే నెలతో పోలిస్తే.. ఈ ఏడాది మే నెలలోనూ సైబర్ నేరాలు, ఫిర్యాదుల తగ్గుదల కొనసాగింది.

# మండలి, శాసనసభలో ఘనంగా రాష్ట్ర అవతరణ వేడుకలు

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా మండలి ఆవరణలో జాతీయ పతాకాన్ని మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు విజయశాంతి, కోదండరాం తదితరులు పాల్గొన్నారు. శాసనసభ ఆవరణలో స్పీకర్ గడ్డం ప్రసాద్ జాతీయ జెండా ఆవిష్కరించారు. పలువురు ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# వస్తోంది కొత్త ఛాంపియన్

(మొదటిపేజీ తరువాయి)

తిలక్ వర్మ (44; 29 బంతుల్లో 2×4, 2×6), సూర్యకుమార్ యాదవ్ (44; 26 బంతుల్లో 4×4, 3×6), బెయిర్‌స్టో (38; 24 బంతుల్లో 3×4, 2×6), నమన్ ధీర్ (37; 18 బంతుల్లో 7×4) సత్తా చాటారు. శ్రేయస్ అద్వితీయ పోరాటానికి నేహాల్ వధేరా (48; 29 బంతుల్లో 4×4, 2×6) సహకారం తోడు కావడంతో లక్ష్యాన్ని పంజాబ్ 19 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. వర్షం వల్ల ఈ మ్యాచ్ ఆరంభం రెండు గంటలకు పైగా ఆలస్యమైంది. ఓవర్లలో ఎలాంటి కోత పెట్టలేదు. శ్రేయస్ పోరాటం: ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ (6) త్వరగానే నిష్క్రమించినా ఛేదన ఆరభంలో పంజాబ్ విశ్వాసంతోనే సాగింది. ఇంగ్లిస్ (38; 21 బంతుల్లో 5×4, 2×6) చక్కని షాట్లతో అలరించాడు. బుమ్రా వేసిన ఇన్నింగ్స్ అయిదో ఓవర్లో రెండు సిక్స్‌లు, రెండు ఫోర్లు బాదాడు. ప్రియాంశ్ ఆర్య (20) కూడా బ్యాట్ ఝళిపించాడు. కానీ ఇన్నింగ్స్ జోరుగా సాగుతున్న దశలో అశ్వని బౌలింగ్‌లో అతడు వెనుదిరిగాడు. ఆరో ఓవర్లో అతడు నిష్క్రమించేటప్పటికి పంజాబ్ స్కోరు 55. ఎనిమిదో ఓవర్లో ఇంగ్లిస్ కూడా ఔటైనా.. శ్రేయస్, నేహాల్ వధేరా చక్కని బ్యాటింగ్‌తో పంజాబ్‌ను రేసులో నిలిపారు. ధాటైన బ్యాటింగ్‌తో సాధించాల్సిన రన్‌రేట్‌ను అదుపులో ఉంచారు. హార్దిక్ బౌలింగ్‌లో వధేరా సిక్స్, ఫోర్ బాదగా.. టాప్లీ ఓవర్లో శ్రేయస్ వరుసగా మూడు సిక్స్‌లు దంచేశాడు.

15 ఓవర్లకు 147/3తో పంజాబ్ గెలుపు పై కన్నేసింది. తర్వాతి ఓవర్లో వధేరా ఔటైనా, 17వ ఓవర్లో శశాంక్ రనౌటైనా శ్రేయస్ అదిరే బ్యాటింగ్‌ను కొనసాగించడంతో పంజాబ్ లక్ష్యం దిశగా సాగింది. 18వ ఓవర్లో బుమ్రా సూపర్ యార్కర్‌ను శ్రేయస్.. బౌండరీకి తరలించిన తీరు అద్భుతం. ఆఖరి రెండు ఓవర్లలో పంజాబ్‌కు 23 పరుగులు అవసరమయ్యాయి. కానీ కళ్లు చెదిరే బ్యాటింగ్‌ను కొనసాగించిన శ్రేయస్.. ఆరు బంతుల్లోనే పని పూర్తి చేశాడు. అశ్వని వేసిన ఇన్నింగ్స్ 19వ ఓవర్లో నాలుగు సిక్స్‌లతో పంజాబ్‌ను విజయ తీరాలకు చేర్చాడు. ముంబయి ధనాధన్: వర్ష వాతావరణంలో అంతకుముందు పంజాబ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. ముంబయి ఓపెనర్ బెయిర్‌స్టో మరోసారి అదరగొట్టాడు. ధనాధన్ ఇన్నింగ్స్ ఆడిన అతడు.. ఆ జట్టుకు బలమైన పునాది వేశాడు. అయితే గత మ్యాచ్‌లో చెలరేగిపోయిన మరో ఓపెనర్ రోహిత్ శర్మ (8) మాత్రం ఈసారి త్వరగానే ఔటయ్యాడు. రోహిత్ నిష్క్రమణ బెయిర్‌స్టోపై ఎలాంటి ప్రభావం చూపలేదు. అతడు ఎటాకింగ్ గేమ్‌తో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. పవర్‌ప్లే ముగిసేసరికి ముంబయి 65/1తో నిలిచింది. అయితే ఏడో ఓవర్లో ప్రమాదకర బెయిర్‌స్టోను ఔట్ చేయడం ద్వారా పంజాబ్‌కు వైశాఖ్ ఊరటనిచ్చాడు. కానీ తిలక్ వర్మ చక్కని షాట్లతో వైశాఖ్ బౌలింగ్‌లో సిక్స్, ఫోర్.. చాహల్ ఓవర్లో సూర్యకుమార్ సిక్స్, ఫోర్ బాదడంతో 10 ఓవర్లు ముగిసేసరికి ముంబయి 102/2తో బలమైన స్థితిలో నిలిచింది. బ్యాటర్ల మెరుపులు కొనసాగడంతో 14వ ఓవర్లో 142/2తో ముంబయి భారీ స్కోరుపై కన్నేసింది. కానీ పరిస్థితి ప్రమాదకరంగా మారిన దశలో అదే స్కోరు వద్ద జోరుమీదున్న ఆటగాళ్లిద్దరినీ ఔట్ చేసి ఊపిరిపీల్చుకుంది పంజాబ్. సూర్యను చాహల్, తిలక్‌ను జేమీసన్ వెనక్కి పంపారు. సూర్య, తిలక్ జంట మూడో వికెట్‌కు 42 బంతుల్లోనే 72 పరుగులు జోడించింది. అయితే నమన్ ధీర్ చెలరేగడంతో ఆఖరి అయిదు ఓవర్లలో ముంబయి 57 పరుగులు రాబట్టగలిగింది. ముంబయి ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (సి) వైశాఖ్ (బి) స్టాయినిస్ 8; బెయిర్‌స్టో (సి) ఇంగ్లిస్ (బి) వైశాఖ్ 38; తిలక్ వర్మ (సి) ప్రియాంశ్ (బి) జేమీసన్ 44; సూర్యకుమార్ యాదవ్ (సి) వధేరా (బి) చాహల్ 44; హార్దిక్ పాండ్య (సి) ఇంగ్లిస్ (బి) అజ్మతుల్లా 15; నమన్ ధీర్ (సి) స్టాయినిస్ (బి) అజ్మతుల్లా 37; రాజ్ బవా నాటౌట్ 8; మిచెల్ శాంట్నర్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 9

- మొత్తం: (20 ఓవర్లలో 6 వికెట్లకు) 203;
- వికెట్ల పతనం: 119, 270, 3142, 4142, 5180, 6197;
- బౌలింగ్: అర్షదీప్ సింగ్ 40440; జేమీసన్ 40301; స్టాయినిస్ 10141; అజ్మతుల్లా 40432; వైశాఖ్ 30301; చాహల్ 40391
- పంజాబ్ ఇన్నింగ్స్: ప్రియాంశ్ (సి) హార్దిక్ (బి) అశ్వనికుమార్ 20; ప్రభ్‌సిమ్రన్ (సి) టాప్లీ (బి) బౌల్ట్ 6; ఇంగ్లిస్ (సి) బెయిర్‌స్టో (బి) హార్దిక్ 38; శ్రేయస్ నాటౌట్ 87; వధేరా (సి) శాంట్నర్ (బి) అశ్వనికుమార్ 48; శశాంక్ రనౌట్ 2; స్టాయినిస్ నాటౌట్ 2; ఎక్స్‌ట్రాలు 4;
- మొత్తం: (19 ఓవర్లలో 5 వికెట్లకు) 207;
- వికెట్ల పతనం: 113, 255, 372, 4156, 5169;
- బౌలింగ్: బౌల్ట్ 40381; టాప్లీ 30400; బుమ్రా 40400; అశ్వని కుమార్ 40552; శాంట్నర్ 20150; హార్దిక్ 20191

# లోతైన పరిశీలన తర్వాతే.. యువ వికాసం

(మొదటిపేజీ తరువాయి)

పత్రాల జారీ ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేయాలని, ఈ నెల 5న మంత్రివర్గ సమావేశం నిర్వహించి కీలక అంశాలను చర్చించాలని తాజాగా మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమావేశంలో నిర్ణయించారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఆదివారం సాయంత్రం 4.30 గంటలకు మంత్రులతో ముఖ్యమంత్రి రేవంత్ నిర్వహించిన భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మినహా మిగిలిన మంత్రులంతా హాజరయ్యారు. బుధవారం రాత్రి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన నివాసంలో మంత్రులందరికీ విందు ఇచ్చిన.. కొద్దిరోజుల్లోనే మరోసారి మంత్రివర్గ సహచరులతో ఆదివారం భేటీ అయ్యారు.

- **ఉద్యోగుల సమస్యలపై కమిటీ నివేదిక గురించి వివరించిన భట్టి**

గత నెల 29, 30 తేదీలలో అన్ని జిల్లాల్లో పర్యటించిన మంత్రులు రాష్ట్ర అవతరణ వేడుకలు, ఇందిరమ్మ ఇళ్లు, రెవెన్యూ సదస్సులు, వానా కాలం పంటల సాగు సన్నద్ధత తదితర అంశాలపై చర్చించారు. ఈ నాలుగు అంశాలపై అధికారులతో సమీక్షలు నిర్వహించారు. అవతరణ దినోత్సవ ఏర్పాట్లతో పాటు ఈ అంశాలపై జిల్లాల వారీగా అధికారులు తయారు చేసిన నివేదికలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందించారు. ఉద్యోగుల సమస్యలపై నియమించిన కమిటీకి సంబంధించి అధికారులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఇప్పటికే నివేదిక అందించారు. ఆ నివేదికపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, మంత్రులకు వివరించారు. దీనిపై క్యాబినెట్‌లో చర్చించి సమస్యల పరిష్కారంపై ఎలా ముందుకెళ్లాలో నిర్ణయం తీసుకోనున్నారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను సమర్థంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నందుకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని మంత్రులు అభినందించారు. రేషన్ కార్డులు, కాళేశ్వరం ప్రాజెక్టులపై విజిలెన్స్, ఎన్‌డీఎస్ఏ ఇచ్చిన నివేదికలపైనా చర్చించినట్లు తెలిసింది.

# పోలవరంలో మీనియేచర్ డ్యాం

(మొదటిపేజీ తరువాయి)

(మీనియేచర్) డ్యాంను నిర్మిస్తారు. విదేశీ నిపుణుల బృందం సిఫార్సు మేరకు ఇందుకు సంసిద్ధమయ్యారు. ఒకవైపు పోలవరంలో డయాఫ్రం వాల్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రెండు గ్యాప్‌లుగా ప్రధాన డ్యాం నిర్మించాల్సి ఉంది. గ్యాప్ 2లో ప్రధాన డ్యాం నిర్మాణానికి డయాఫ్రం వాల్ నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంటుంది. గ్యాప్ 1లో ప్రధాన డ్యాం నిర్మాణానికి అంతా సిద్ధమైంది. ఆకృతులు సిద్ధమయ్యాయి. వాటిని పోలవరం ప్రాజెక్టు అథారిటీ ద్వారా కేంద్ర జలసంఘానికి సమర్పిస్తారు. రెండో గ్యాప్‌లో ప్రధాన డ్యాం నిర్మాణం ఈ ఏడాది నవంబరు నుంచి ప్రారంభించాలనే ఆలోచన ఉన్నా మరింత ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది. ప్రధాన డ్యాం.. గ్యాప్ 1లో 540 మీటర్లు, గ్యాప్ 2లో 1,750 మీటర్లు నిర్మించాలి. 45.72 మీటర్ల ఎత్తుకు ఈ డ్యాం నిర్మిస్తారు. ఈ నేపథ్యంలో ప్రధాన డ్యాం ఎలా నిర్మిస్తారో అచ్చం అదే మెటీరియల్ వాడుతూ ముందుగా ఒక మోడల్ డ్యాం నిర్మించి దాని పటిష్ఠత, ఎన్ని సార్లు రోలింగు చేస్తే అనుకున్న గట్టితనం వస్తుంది? వంటి అంశాలను తేల్చాలని విదేశీ నిపుణుల బృందం సిఫార్సు చేసింది. విదేశాల్లో ఏ పనులు చేసినా తొలుత ఇలా నమూనాగా చేసి, దానిని పరీక్షించి ఆ ఫలితాల ఆధారంగా ముందుకు సాగుతారు. ప్రస్తుతం ఆఫ్రి ఆకృతుల సంస్థతో పాటు విదేశీ నిపుణులూ ఈ మోడల్ డ్యాంను నిర్మించాలని పేర్కొన్నారు.

**ఇవీ కొలతలు**

పోలవరం గ్యాప్ 2 ప్రధాన డ్యాం దిగువనే ఈ మోడల్ డ్యాం నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన తవ్వకం పనులు ప్రారంభమయ్యాయి. మొత్తం 35 మీటర్ల పొడవు, 50 మీటర్ల వెడల్పు, 3 మీటర్ల ఎత్తుతో ఈ మీనియేచర్ నిర్మాణం చేపడుతున్నారు. ప్రధాన డ్యాం నిర్మాణంలో ఆకృతుల ప్రకారం ఏ మెటీరియల్ ఎంత మేర వాడుతున్నారో ఇక్కడా అదే తరహాలో వినియోగించనున్నారు. నల్ల మట్టి, రాళ్లు, ఇసుక, ఇతర మెటీరియల్ ఇందులో నింపుతారు. రోలింగు చేస్తారు. ఈ నిర్మాణానికి మూడు వారాల సమయం పడుతుంది. ఈ మీనియేచర్ నిర్మాణం వల్ల ఎదురయ్యే అనుభవాలతో డ్యాం గట్టితనాన్ని పసిగట్టవచ్చని ఇంజినీరింగ్ అధికారులు పేర్కొంటున్నారు. మే చివరి వారం నుంచే వర్షాలు ప్రారంభం కావడంతో ఈ పనులకు కొంత అంతరాయం కలుగుతోంది. గ్యాప్ 1 ప్రధాన డ్యాం నిర్మాణానికి సూత్రప్రాయ ఆమోదం లభించినా డిజైన్లు ఖరారు కావాల్సి ఉంది. మోడల్ డ్యాం నిర్మించి అధ్యయనం చేసి ఆ తర్వాతే అడుగులు ముందుకు వేయాల్సి ఉంటుంది.



# శాంతికి ముళ్లబాటే!

మాస్కో: శాంతి స్థాపనలోనూ తన మాటే నెగ్గేలా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వ్యవహరిస్తున్నారు. ఉక్రెయిన్‌తో శాంతి చర్చల కోసం.. రాజీలేని డిమాండ్లు పెడుతున్నారు. అంతేకాకుండా వాటిని అంగీకరింపజేసేందుకు ఉక్రెయిన్‌పై క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడుతున్నారు. దాని ద్వారా తనదే పైచేయి అయ్యేలా స్పష్టమైన సందేశం పంపుతున్నారు. మరోవైపు ఈ చర్యలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేయకుండా.. ఆయనను ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. ట్రంప్ దౌత్యానికి మద్దతు పలుకుతూనే శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నామని సంకేతాలను పంపుతున్నారు. అయితే పుతిన్ షరతులను ఉక్రెయిన్‌తోపాటు పశ్చిమ దేశాలు వ్యతిరేకిస్తున్నాయి. తుర్కియేలోని ఇస్తాంబుల్‌లో సోమవారం మరోసారి శాంతి చర్చలు జరగనున్న నేపథ్యంలో పుతిన్ షరతులు తెరపైకి వచ్చాయి.

**'చెడంటే ప్రపంచ యుద్ధమా?'**

ట్రంప్ వాదనను మాజీ అధ్యక్షుడు, పుతిన్ భద్రతా మండలి ఉప అధిపతి అయిన దిమిత్రి మెద్వెదెవ్ ఖండించారు. 'నిజంగా చెడు అంటే నాకు తెలిసింది మూడో ప్రపంచ యుద్ధమే. ట్రంప్ దీనిని అర్థం చేసుకుంటారని భావిస్తున్నా' అని వ్యాఖ్యానించారు. ట్రంప్‌తో పుతిన్ మైండ్‌గేమ్ ఆడుతున్నారని, ఇద్దరూ ఒకరినొకరు బాగా అర్థం చేసుకుంటారని భావిస్తున్నారని లుక్యనోవ్ అనే విశ్లేషకుడు అభిప్రాయపడ్డారు. తనతో సంభాషించే ట్రంప్‌నకు ఇది పెద్ద ప్రాధాన్యాంశం కాదని, ఏదో ఒక విధంగా దీనిని వదిలించుకోవాలనే దృష్టితో ఆయన ఉన్నారనే కోణంలోనే పుతిన్ ఎత్తుగడలుంటాయని వివరించారు.

- **ఆంక్షలు విధించాల్సిందేనంటున్న ఐరోపా దేశాలు**

కాల్పుల విరమణకు పుతిన్ అంగీకరించేలా రష్యాపై కఠిన ఆంక్షలను విధించాలని ట్రంప్‌ను ఐరోపా దేశాలు కోరుతున్నాయి. అసలు ఈ యుద్ధం నుంచి అమెరికా దూరం జరుగుతుందేమోనని అవి భయపడుతున్నాయి. ఒకవేళ అమెరికా సైనిక సాయాన్ని ఆపితే ఉక్రెయిన్ పోరాట పటిమ బాగా దెబ్బతింటుందనేది వాటి ఆలోచనగా ఉంది.

- **పెరుగుతున్న రష్యా ఒత్తిడి**

ఉక్రెయిన్‌ను ఇప్పటికే ఆయుధాల కొరత వెంటాడుతోంది. ముఖ్యంగా గగనతల రక్షణ వ్యవస్థ లేకపోవడంతో రష్యా చేసే క్షిపణులు, డ్రోన్ల దాడులను తట్టుకోలేకపోతోంది. 1,000 కిలోమీటర్ల సరిహద్దు పరిధిలో ఆయుధాల్లేని ఉక్రెయిన్ దళాలు ఒత్తిడికి గురవుతున్నాయి. ఇప్పటికే డొనెట్స్క్ ప్రాంతంపై ఆధిపత్యం చెలాయిస్తున్న రష్యా.. ఈశాన్యంలోని సుమీ, ఖార్కివ్‌లపై తీవ్ర దాడులు చేస్తోంది. దీనిని బఫర్ జోన్‌గా చేస్తానని పుతిన్ ఇప్పటికే హామీ ఇచ్చారు.

- **మరిన్ని ప్రాంతాల ఆక్రమణ**

వచ్చే వేసవిలో మరిన్ని ప్రాంతాలపై దాడులకు రష్యా సిద్ధమవుతోంది. వాటిని ఆక్రమించుకోవడం ద్వారా శాంతి చర్చలకు మరిన్ని కఠిన నిబంధనలు పెట్టనుంది. కాలక్రమంలో ఉక్రెయిన్‌పై మరింత ఆధిపత్యం సాధించవచ్చని రష్యా ఆలోచిస్తోంది. చర్చల నుంచి వైదొలగుతానని ట్రంప్ హెచ్చరించడంతో దాడులు తీవ్రం చేయవచ్చని భావిస్తోంది.

- **పుతిన్ షరతులివే..**

డొనెట్స్క్, లుహాన్స్క్, జపోజరియా, ఖేర్సన్ నుంచి ఉక్రెయిన్ దళాలు వైదొలగాలి. (2022 సెప్టెంబరు నుంచి ఈ ప్రాంతాల్లో రష్యా తిష్ఠ వేసింది. అయితే పూర్తి పట్టు సాధించలేకపోయింది.




# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | సోమవారం 02-06-2025 | సంపుటి - 24 | సంచిక - 31 | రూ : 4 | పేజీలు: 8





## వస్తోంది కొత్త ఛాంపియన్

- ఐపీఎల్ ఫైనల్లో పంజాబ్
- క్వాలిఫయర్ 2లో ముంబయిపై విజయం
- శ్రేయస్ అద్భుత ఇన్నింగ్స్

**అహ్మదాబాద్:** పంజాబ్ కింగ్స్ సత్తా చాటింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (87 నాటౌట్; 41 బంతుల్లో 5×4, 8×6) చెలరేగిన వేళ ఆ జట్టు ఐపీఎల్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఆదివారం క్వాలిఫయర్ 2లో 5 వికెట్ల తేడాతో ముంబయి ఇండియన్స్‌ను మట్టికరిపించింది. మొదట ముంబయి 6 వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసింది.

తరువాయి 2లో

## ముస్లిం ఓట్ల కోసమే..
# సిందూర్‌పై మమత వ్యతిరేకత



- ముర్షిదాబాద్ అల్లర్లు రాష్ట్ర ప్రాయోజితమే
- బెంగాల్‌లో అమిత్ షా విమర్శలు

కోల్‌కతా: ముస్లిం ఓటుబ్యాంకును సంతృప్తిపరచడానికే ఆపరేషన్ సిందూర్, వక్ఫ్ సవరణ చట్టాలను పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వ్యతిరేకిస్తున్నారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా విమర్శించారు. బెంగాల్‌లోని

తరువాయి 2లో

## శాంతికి ముళ్లబాటే!

2లో

- కఠిన డిమాండ్లు పెట్టిన పుతిన్
- అంగీకరించేలా ఒత్తిడి తెచ్చేందుకు ఉక్రెయిన్‌పై భారీ దాడులు
- రష్యా తీరును తప్పబడుతున్న పశ్చిమ దేశాలు
- నిప్పుతో చెలగాటమన్న ట్రంప్
- నేడు మరోసారి చర్చలు

## తెలంగాణ జాగృతి అనుబంధ సంస్థగా యూపీఎఫ్

- కార్యవర్గాన్ని ప్రకటించిన కవిత

బంజారాహిల్స్ : తెలంగాణ జాగృతి అనుబంధ సంస్థగా యునైటెడ్ ఫులే ఫ్రంట్ (యూపీఎఫ్) పనిచేస్తుందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రకటించారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో యూపీఎఫ్ నాయకులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా యూపీఎఫ్ కార్యవర్గాన్ని ప్రకటించారు. కన్వీనర్‌గా బొల్లా శివశంకర్, కోఆర్డినేటర్‌గా ఆలకుంట హరి, సలహాదారుగా గట్టు రామచంద్రరావుతోపాటు మరో 50 మందిని సహ కన్వీనర్లుగా నియమించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. తెలంగాణ జాగృతి, యూపీఎఫ్ ఐక్య పోరాటాల వల్లే కాంగ్రెస్ ప్రభుత్వం దిగివచ్చి బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ వేర్వేరు బిల్లులు ప్రవేశపెట్టిందన్నారు. బీసీల రిజర్వేషన్లు అమల్లోకి వచ్చేంతవరకూ తాము ఉద్యమాలు కొనసాగిస్తామని స్పష్టంచేశారు.



# లోతైన పరిశీలన తర్వాతే.. యువ వికాసం

**నేడు ప్రారంభించాల్సిన ప్రక్రియ వాయిదా**

- మంత్రులతో భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయం
- 'కాళేశ్వరం'పై విజిలెన్స్, ఎన్‌డీఎస్‌ఏ నివేదికలపై సమీక్ష
- 5న మంత్రివర్గ సమావేశం.. అందులో ఉద్యోగుల

హైదరాబాద్: రాజీవ్ యువ వికాసానికి ఊహించిన దానికంటే ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు అందాయని, అనర్హులకు యువ వికాసం అందకుండా చూడాలంటూ పెద్ద ఎత్తున వినతులు వచ్చాయని మంత్రులు... ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ''పెద్ద సంఖ్యలో వచ్చిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో.. పూర్తి స్థాయి పరిశీలన తర్వాతే.. అర్హుల జాబితాలను ప్రకటించాలి. మరింత లోతుగా విశ్లేషించి.. అర్హులను గుర్తించాలి. ఒక్క అనర్హుడికి కూడా రాజీవ్ యువ వికాసం ద్వారా లబ్ధి చేకూరవద్దు. ఈ అంశంపై క్యాబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకోవాలి'' అని సమావేశంలో నిర్ణయించారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన రాజీవ్ యువ వికాసం పథకంలో ఎంపికైన వారికి ఈనెల 2న మంజూరు పత్రాలు ఇవ్వాలని తొలుత ప్రభుత్వం భావించింది. ఈ మేరకు కేటగిరీ 1, 2లో ఎంపికైన వారికి మంజూరు పత్రాలను సిద్ధం చేసింది. అయితే భారీగా దరఖాస్తులు వచ్చిన నేపథ్యంలో.. ఈ మంజూరు

తరువాయి 2లో









# అమరావతి నవ నగరాల్లో బస్టాండ్లు, డిపోలు

- రాయలసీమ, ఉత్తరాంధ్ర, హైదరాబాద్ వైపుల నుంచి బస్సుల కోసం టెర్మినల్స్
- వీటన్నింటికి 165 ఎకరాలు కోరనున్న ఆర్టీసీ

అమరావతి: రాజధాని అమరావతికి మున్ముందు ప్రజల రాకపోకలు పెద్దఎత్తున పెరగనుండటంతో.. అక్కడ ఓ ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ప్రయాణించేందుకు వీలుగా అవసరమైన రవాణా సదుపాయాలు కల్పించడంపై ఏపీఎస్ఆర్టీసీ దృష్టి పెట్టింది. బస్టాండ్లు, డిపోలు, టెర్మినల్స్ నిర్మాణానికి వీలుగా భూములు కేటాయింపు జరిగేలా ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, తదితరాలకు సీఆర్‌డీఏ పరిధిలో భూములు కేటాయించారు. బస్టాండ్లు వంటివి ప్రజలకు అందుబాటులో ఉండే చోట నిర్మించాల్సి ఉంటుంది. అందుకే వీటి కోసం ఇప్పటి నుంచే భూములు తీసుకోవాలని ఆర్టీసీ భావిస్తోంది. దీనికి సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేసింది.

### 3 ప్రాంతాల్లో ఇంటర్‌ఛేంజ్ టెర్మినల్స్

దూర ప్రాంతాల నుంచి అమరావతికి రాకపోకలు సాగించేవారికి ఇబ్బందులు లేకుండా మూడు చోట్ల ఇంటర్‌ఛేంజ్ టెర్మినల్స్ నిర్మించాలని భావిస్తున్నారు. ఉత్తరాంధ్ర, విశాఖ వైపు నుంచి వచ్చే బస్సుల కోసం ఒకటి, రాయలసీమ జిల్లాలు, చెన్నై, బెంగళూరుల వైపు నుంచి వచ్చే బస్సుల కోసం మరొకటి, హైదరాబాద్

తరువాయి 2లో

# రాష్ట్రంలో సైబర్ దోపిడీలు తగ్గాయి!



- రికవరీలో 13 శాతం పెరుగుదల
- సైబర్ సెక్యూరిటీ బ్యూరో వెల్లడి

హైదరాబాద్: అధిక లాభాల పేరుతో పెట్టుబడి మోసాలు, డిజిటల్ అరెస్టులు తదితర సైబర్ నేరాల నియంత్రణకు చేస్తున్న కృషి ఫలిస్తోందని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ప్రకటించింది. గతేడాదితో పోలిస్తే.. ఈ ఏడాది సైబర్ నేరాలు, వాటికి సంబంధించిన ఫిర్యాదులు తగ్గాయని బ్యూరో సంచాలకురాలు శిఖాగోయల్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గతేడాది మొదటి నాలుగు నెలల (జనవరిఏప్రిల్)తో పోలిస్తే.. ఈ ఏడాది ఇదే సమయంలో రాష్ట్రంలో ఆర్థికపరమైన నష్టానికి సంబంధించిన ఫిర్యాదులు 11 శాతం తగ్గాయి. సైబర్ నేరాలతో ప్రజలు కోల్పోయిన మొత్తం 19 శాతం తగ్గింది. 2024 చివరి నాలుగు

తరువాయి 2లో

# పోలవరంలో మీనియేచర్ డ్యాం

- అచ్చం.. ప్రధాన డ్యాంను పోలిన విధంగా నిర్మాణం
- గట్టితనం అంచనాకు ఉపయుక్తం

అమరావతి: పోలవరం ప్రాజెక్టులో ఒక మీనియేచర్ డ్యాం నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారు. ప్రధాన డ్యాం ఎలా నిర్మిస్తారో సరిగ్గా అదే తరహాలో ప్రాజెక్టుకు సమీపంలో దానిని పోలిన చిన్న

తరువాయి 2లో



# ప్రాధాన్యత క్రమంలో సమస్యలను పరిష్కరించి అన్ని రకాల మౌలిక వసతులను కల్పిస్తాం

*** బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : ప్రాధాన్యత క్రమంలో ఒక్కొక్కటిగా అన్ని సమస్యలను పరిష్కరించి అన్ని రకాల మౌలిక వసతులను కల్పిస్తామని బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. ఆదివారం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి బహదూర్ పల్లిలోని "ప్రణీత్ ఫ్లోరా" లో బిఆర్ఎస్ పార్టీ విప్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు చుట్టూ అటవీ ప్రాంతం ఉండడంతో మురుగునీరు, వ్యర్థ పదార్థాలు బయటకు పోలేని పరిస్థితి ఉందని అధికారులతో మాట్లాడి ఎస్టిపి సదుపాయం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా బహదూర్ పల్లి నుంచి బాచుపల్లి వెళ్లే మార్గంలో రోడ్డంతా పంపులు తిరిగి ఉండడం, వీధిలైట్లు లేకపోవడంతో వాహనాలు అధిక వేగంతో రావడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని తెలియజేశారు.అనంతరం బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ ప్రణీత్ ఫ్లోరాకు మంచినీటి సౌకర్యం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని



త్వరలోనే మంజీరా నీటి సరఫరా కనిపిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రణీత్ ఫ్లోరా అపార్ట్మెంట్ వాసులు రవికుమార్ రెడ్డి, వెంకటరమేష్ రెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, రవితేజ, మహేందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, జక్కుల కృష్ణ యాదవ్,, నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మాజీ గ్రంధాలయ చైర్మన్ నాగరాజు యాదవ్, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కోఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, దుండిగల్ మున్సిపాలిటీ యూత్ అధ్యక్షులు మైసిగారి శ్రీకాంత్, సీనియర్ నాయకులు సగ్గిడి శ్రీనివాస్, మధు మేకల, ప్రణీత్ ఫ్లోరా అపార్ట్మెంట్ వాసులు తదితరులు పాల్గొన్నారు

## ఐ.కె.స్టీల్ ట్రేడర్స్ అండ్ రాయల్ స్టీల్ ఎంటర్ ప్రైజెస్ ప్రారంభం



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపాలిటీ పరిధి దూలపల్లి స్టీల్ సిటీ నందు నూతనంగా ఏర్పాటు చేసిన ఐ.కె.స్టీల్ ట్రేడర్స్ అండ్ రాయల్ స్టీల్ ఎంటర్ ప్రైజెస్" ను ఆదివారం బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్య నారాయణ, హేమలతా సురేష్ రెడ్డి, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కోఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, ఇబ్రహీం ఖాన్, అబ్దుల్ ఆరిఫ్, సయ్యద్ మెహరాజ్, మొయిన్ పటేల్, మహమ్మద్ ఇలియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## కాలనీ అభివృద్ధిలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు భాగస్వాములు కావాలి

*** బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : కాలనీ అభివృద్ధిలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు భాగస్వాములు కావాలని బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. గాజుల రామారం డివిజన్ ఆదర్శ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం సభ్యులు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీ అభివృద్ధి విషయంలో వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు ఐకమత్యంగా ఉండి మిగతా కాలనీలకు ఆదర్శవంతంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షులు ఎస్.గోపాల్, ప్రధాన కార్యదర్శి సాగర్ రావు, కోశాధికారి శ్రీకాంత్ రెడ్డి, సలహాదారులు దయాకర్ రెడ్డి, ఎస్.వి.ఎన్ చారి, ఉపాధ్యక్షులు బిక్షపతి, వర్కింగ్ ప్రెసిడెంట్ శివ శంకర్, సంయుక్త కార్యదర్శి శ్రీపాద్, కార్యనిర్వహక కార్యదర్శి అనంత రెడ్డి, సాంస్కృతిక కార్యదర్శి ఎన్.కె.గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## నిరు పేద విద్యార్థులకు చేయూతనందించడం అభినందనీయం

*** బీఆర్ఎస్ యూత్ నాయకులు కొలుకుల జైహింద్**



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : నిరు పేద విద్యార్థులకు చేయూతనందించడం అభినందనీయమని బీఆర్ఎస్ యూత్ నాయకులు కొలుకుల జైహింద్ అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దూంనగర్ భగత్ సింగ్ మార్గ్లో గల శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థిని ఎం.అమూల్య పదవ తరగతి పరిక్ష ఫలితాలలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోనే రెండో అత్యధిక మార్కులు సాధించి ప్రభంజనం సృష్టించింది. ఈ సందర్భంగా హెల్పింగ్ హార్ట్స్ సోసైటి ఆధ్వర్యంలో జగద్గిరిగుట్ట కు చెందిన శ్రీ శక్తి జ్యువెలర్స్ విరేందర్ సింగ్ దంపతులు, బీఆర్ఎస్ యూత్ నాయకులు కొలుకుల జైహింద్, పాఠశాల చైర్మన్, కరస్పాండెంట్ బిర్రు ఆంజనేయులు, హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ తూటే విజయ్ కుమార్, సామాజిక వేత్త మధుబాబు చికిలే, రాయి విఘ్నేష్ లు విద్యార్థిని నివాసానికి వెళ్లి తల్లి తండ్రుల సమక్షంలో వెండి పథకం అందించి శాలువా కప్పి సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో మున్ముందు ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు.



## ఘనంగా శ్రీశ్రీశ్రీ మహాత్మ బసవేశ్వర విగ్రహ ఆవిష్కరణ

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి ) : కుత్బుల్లాపూర్ సర్కిల్ సుభాష్నగర్ డివిజన్ పరిధిలోని ఫాక్స్ సాగర్ కట్ట దిగువన నూతనంగా ఏర్పాటుచేసిన శ్రీశ్రీశ్రీ మహాత్మ బసవేశ్వర విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజన హితాయ, బహుజన సుఖాయ అనే సిద్ధాంతంతో సామాన్యుల హక్కుల కోసం శ్రమించిన గొప్ప తత్వవేత్త శ్రీశ్రీశ్రీ మహాత్మ బసవేశ్వరుడని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గుడిమెట్ల హేమలత సురేష్ రెడ్డి, ఫిషరీస్ కోఆపరేటివ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు మన్నె రాజు, పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, మాజీ గ్రంధాలయ చైర్మన్ నాగరాజు యాదవ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, రుద్ర అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, సీనియర్ నాయకులు శ్రీనివాసరాజు, దుర్గారావు, గుబ్బల లక్ష్మీనారాయణ, అడప శేషు, బలరాం రెడ్డి, శ్రీనివాస్ రాజు, ఇస్మాయిల్, దుబాయ్ శ్రీను, ఆ సంఘం గౌరవాధ్యక్షులు శెట్టి ప్రకాష్, కోలుకుంద బస్వరాజ్, ఎస్. వీరశెట్టి, అధ్యక్షులు నాగరాజు గౌడ, కోశాధికారి అమరనాథ్, కార్యదర్శి రుద్ర కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ బి. బసవ రాజు, సభ్యులు శరణ్, అవుటి రమేష్, సోమ శేఖర్ గౌడ్, ప్రభు లింగం, బస్వరాజు, శంకర్, ఎం.మల్లేశం, కుల భాందవులు తదితరులు పాల్గొన్నారు.



## చౌటుప్పల్ లో ఘనంగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు

**- శ్రీ సీతా రామచంద్ర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు చౌటుప్పల్ మండలంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కేంద్రంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో దేవాలయ కమిటీ చైర్మన్ బొబ్బిళ్ళ మురళి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ సీతారామచంద్ర స్వామి, శ్రీ కాశీ విశ్వేశ్వరునికి పంచామృతాభిషేకం, అష్టోత్తర శతనామార్చన, ఆశీర్వచన చేశారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి లక్ష్మీ దంపతుల పేరున అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బస్టాండ్ ఆవరణలోని రాజీవ్ స్మారక్ భవన్ వద్ద కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజులు మాట్లాడుతూ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి త్వరలో మంత్రివర్గంలో చోటు దక్కించుకున్నారు. మునుగోడు ప్రాంత అభివృద్ధికి తోడ్పడాలని ప్రార్థించారు. అనంతరం భక్తులకు ప్రసాదం , స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుర్వి



నరసింహ గౌడ్, మార్కెట్ వైస్ చైర్మన్ బోయ దేవేందర్, మాజీ మున్సిపల్ అధ్యక్షుడు మోగుదాల రమేష్ గౌడ్, మాజీ మండల అధ్యక్షుడు బక్క శ్రీనాథ్, ధర్మకర్తలు కామిశెట్టి చంద్రశేఖర్ గుప్త, వెంకటేశం, వర్కాల రవి గౌడ్, తూర్పాటి నరసింహ, మాజీ వైస్ ఎంపీపీలు ఉప్పు భద్రయ్య, బొంగు జంగయ్య, పాక చిరంజీవి, కంచరకుంట్ల రాంరెడ్డి, బాబా షరీఫ్, బత్తుల విప్లవ గౌడ్, దేప రాజు, బొబ్బిలి రాజేందర్, ఎస్.కే. జానీబాబు, బండమీద వెంకటేష్, ఊదరి నరసింహ, తొర్పునూరి శ్రీకాంత్ గౌడ్, వర్కాల రాము గౌడ్, డాకోజి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం.. భారత్‌కు రానున్న ప్రభాకర్‌రావు..!

హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న విశ్రాంత ఐపీఎస్ అధికారి టి.ప్రభాకర్‌రావు ఈ నెల 5న సిట్ విచారణకు హాజరవుతారని సమాచారం. ఆయన 14 నెలలుగా అమెరికాలోనే ఉన్నారు. ఇటీవల భారత్‌కు తిరిగిరావాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలతో.. తిరిగి రానున్నారు. విచారణకు హాజరవుతానని సిట్‌కు ప్రభాకర్‌రావు తెలియజేసినట్లు సమాచారం. మరోవైపు విచారణకు సహకరిస్తానంటూ సుప్రీంకోర్టుకు అండర్‌టేకింగ్ లేఖ ఇచ్చారు. వన్ టైం ఎంట్రీ పాస్‌పోర్టు అందిన వెంటనే భారత్‌కు రానున్నారు. పాస్‌పోర్టు అందిన మూడు రోజుల్లో రావాలని ఇటీవల సర్వోన్నత న్యాయస్థానం ఆయన్ను ఆదేశించింది. ప్రభాకర్‌రావును విచారిస్తే కేసు కొలిక్కి రావొచ్చని దర్యాప్తు బృందం భావిస్తోంది.



## వైభవంగా శ్రీ శ్రీ భ్రమరాంబిక మల్లిఖార్జున స్వామి కళ్యాణోత్సవం



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని నల్లగండ్ల శ్రీ శ్రీ భ్రమరాంబిక మల్లిఖార్జున స్వామి కళ్యాణోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి వారి కళ్యాణ మహోత్సవానికి కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్, శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్ , కెకెఎం ట్రస్ట్ చైర్మన్, కంటెస్టెడ్ కార్పొరేటర్ కూన శ్రీనివాస్ గౌడ్ లు పాల్గొని స్వామివారి కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం వారు శ్రీ శ్రీ భ్రమరాంభిక మల్లిఖార్జున స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బండి శ్రీనివాస్ గౌడ్,శివ కుమార్ గౌడ్, వేణు, నాగరాజు, సంతోష్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన ఆదివారం చౌటుప్పల్ లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా వాడపల్లికి చెందిన అన్నెబోయిన యాదగిరి తండ్రి సైదయ్య తన కుటుంబ సభ్యులతో కలిసి మే 31వ తేదీ రాత్రి 8:30గంటల సమయంలో తన సొంత కారులో హైదరాబాద్ నుంచి వాడపల్లి వైపు ప్రయాణం చేస్తున్నారు. ఈ క్రమంలో చౌటుప్పల్ ఆర్టీసీ బస్టాండ్ సమీపానికి వచ్చేసరికి, ముందు వెళ్తున్న లారీ డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ అకస్మాత్తుగా బ్రేక్ వేయడం వల్ల యాదగిరి నడుపుతున్న కారు అదుపుతప్పి లారీని వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో అన్నెబోయిన యాదగిరి ఛాతి భాగానికి గాయాలు కాగా, అతని భార్య నుదుటి భాగంలో గాయపడింది. అలాగే అతని అక్క కాలు భాగానికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడినవారిని చికిత్స నిమిత్తం సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అన్నెబోయిన యాదగిరి ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## డాలస్‌లో కేటీఆర్‌కు ఘన స్వాగతం




హైదరాబాద్: భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అమెరికాలోని డాలస్ చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆయనకు ఎన్నారైలు, పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. డాలస్‌లోని డాక్టర్ పెప్పర్ ఎరినా ప్రాంగణంలో జరగనున్న భారాస రజతోత్సవాలు, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు.

## భాజపా పూర్తి కంట్రోల్‌లో అన్నాడీఎంకే: సీఎం స్టాలిన్ ధ్వజం

మదురై: వచ్చే ఏడాది జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి అధికార డీఎంకే ప్రచార శంఖారావాన్ని పూరించింది. మదురైలో నిర్వహించిన డీఎంకే జనరల్ కౌన్సిల్ సమావేశంలో ఆ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఎన్నికల ప్రచారాన్ని అధికారికంగా ప్రారంభించారు. వచ్చే రెండు మాసాల్లో డీఎంకే సభ్యులు కనీసం 30శాతం మేర ఓటర్లను ఎన్‌రోల్ చేయించాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. భాజపాతో మళ్లీ పొత్తు పెట్టుకున్న ప్రతిపక్ష పార్టీ అన్నాడీఎంకేపై స్టాలిన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అన్నాడీఎంకే పూర్తిగా భాజపా కంట్రోల్‌లోకి వెళ్లిపోయిందని, ప్రతిపక్ష నేత పళనిస్వామి రాష్ట్రాన్ని భాజపా చేతిలో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇది ఎప్పటికీ జరగదన్నారు.

# భద్రాచలం రామాలయంలో అపచారం.. సంచులపై అన్యమత ప్రచార స్లోగన్

భద్రాచలం: దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో అపచారం చోటు చేసుకోవడం భక్తులను కలవరానికి గురి చేసింది. స్వామివారి శేషవస్త్రాలు కొనుగోలు చేస్తే దేవుడి కటాక్షం లభిస్తుందని భక్తుల విశ్వాసం. దేవస్థానం నుంచి హక్కులు పొందిన వ్యాపారి నిర్వహిస్తున్న శేషవస్త్రాల విక్రయ దుకాణంలో ఆదివారం అన్యమత ప్రచార సంచిలో పెట్టి వస్త్రాలు విక్రయించడం భక్తులను ఆందోళనకు గురి చేసింది.



**అంజన్న ఆలయం పక్కనే**

భక్తులు దైవ దర్శనానికి వచ్చినప్పుడు మొక్కులు చెల్లించుకోవడంలో భాగంగా సీతారాముల వారికి వస్త్రాలను సమర్పిస్తుంటారు. అనంతరం వీటిని సేకరించి అదే ప్రాంగణంలోని ఆంజనేయస్వామి ఆలయం పక్కన విక్రయిస్తుంటారు. ఇందుకు ఓ వ్యాపారి ఏడాదికి రూ.50 లక్షలు ఆలయానికి చెల్లించాల్సి ఉంటుంది. కానీ, ఆ దుకాణంపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అన్యమత ప్రచార సంచులను ఏదో ఒక రూపంలో భక్తులకు అంటగట్టి అపచారం చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**ఏం జరిగిందంటే?**

ఏపీలోని గుంటూరుకు చెందిన కొందరు భక్తులు ఆదివారం రామయ్యను దర్శించుకుని రూ.1,100 చెల్లించి రెండు చీరలను కొనుగోలు చేశారు. దుకాణంలో పని చేస్తున్న వారు వీటిని రెండు సంచుల్లో పెట్టి భక్తులకు అందించారు. కొద్దిసేపటి తర్వాత ఆ సంచులపై ఉన్న అన్యమత ప్రచార స్లోగన్ చూసి భక్తులు అవాక్కయ్యారు. ఇదేంటని అడిగితే దుకాణదారు నుంచి సరైన సమాధానం రాలేదని, దీంతో తమకు ఎదురైన చేదు అనుభవం గురించి ఆలయ అధికారికి ఫిర్యాదు చేసినట్లు భక్తులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న ఆలయ సిబ్బంది దుకాణాన్ని పరిశీలించి అక్కడ కొన్ని సంచులపై అన్యమత ప్రచార స్లోగన్ ఉన్నట్లు గుర్తించారు. వెంటనే వాటిని అక్కడి నుంచి తీసేసినట్లు సమాచారం. ఈ విషయమై దుకాణ నిర్వహకులు మాట్లాడుతూ.. తమ వద్ద ఉన్న అన్ని సంచులపై దేవస్థానం చిత్రాలే ఉంటాయని, ఆ సంచులపై అన్యమత స్లోగన్ ఉన్నట్లు తాము చూడలేదని.. అవి ఎలా వచ్చాయో కూడా తెలియదని చెబుతున్నారు. ఆలయ సిబ్బంది మాత్రం ఒకటో రెండో సంచులపై అన్యమత ప్రచార స్లోగన్ ఉంటే తొలగించామని అవి ఏ విధంగా వచ్చాయో తెలుసుకుంటామని తెలిపారు. ఈఓ రమాదేవి వివరణ కోరేందుకు మీడియా ప్రతినిధులు ఫోన్ ద్వారా సంప్రదించగా.. ఆమె స్పందించలేదు

# కాంగ్రెస్ ప్రభుత్వంలో అవినీతి వికేంద్రీకరణ : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



హైదరాబాద్: దేశ అభివృద్ధిపై చర్చకు సిద్ధమని కేంద్రమంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి.. కాంగ్రెస్ పార్టీకి సవాల్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి, భాజపా ప్రభుత్వానికి నక్కకు, నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర పదాధికారులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా అధ్యక్షులకు వర్క్‌షాప్ నిర్వహించారు. నరేంద్రమోదీ 11 ఏళ్ల పాలన, అంతర్జాతీయ యోగాదినోత్సవం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహణ, వ్యవసాయానికి కేంద్రం అందిస్తున్న సహాయ సహకారాలు, రాష్ట్రంలో అకాలవర్షాల వల్ల జరిగిన నష్టం, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, తాజా రాజకీయ పరిణామాలపై ప్రధానంగా చర్చ జరిగింది. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల వద్దకు వెళ్లి 11 ఏళ్ల మోదీ పాలనను వివరించాలని పదాధికారులకు దిశానిర్దేశం చేశారు. భారత్‌ను అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలపాలన్నదే ప్రధాని మోదీ లక్ష్యమని తెలిపారు. భారాస, కాంగ్రెస్ రెండూ కలిసి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టాయని, తెలంగాణను రక్షించుకోవాల్సిన అవసరముందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అవినీతి వికేంద్రీకరణ జరిగిందని, భారాస ప్రభుత్వంలో అవినీతి కేంద్రీకృతం అయిందని ఆరోపించారు. కాంగ్రెస్ అధిష్ఠానానికి డబ్బులు తెలంగాణ రాష్ట్రం నుంచే వెళ్తున్నాయని తీవ్ర ఆరోపణలు చేశారు. భాజపా తప్ప తెలంగాణ రాష్ట్రాన్ని ఏ పార్టీ కాపాడలేదని, అందుకే ప్రజలు భాజపా వైపు చూస్తున్నారన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలు, భారాస అవినీతిని ప్రజల ముందుకు తీసుకెళ్లాలని పార్టీ నేతలకు సూచించారు.

# అభ్యుదయ రైతులకు ప్రొ.జయశంకర్ వర్సిటీ విత్తనాలు

**: మంత్రి తుమ్మల**

హైదరాబాద్: రాష్ట్రావతరణ దినోత్సవం సందర్భంగా జూన్ 2 నుంచి ప్రొ.జయశంకర్ వ్యవసాయ వర్సిటీ విత్తనాలను రైతులకు పంపిణీ చేయనున్నట్లు తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఎంపిక చేసిన అభ్యుదయ రైతులకు 5 పంటలకు విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. మంత్రులు, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా 11వేల గ్రామాల్లో 40వేల మందికి విత్తనాలు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.



# పోలీసు సేవా పతకాలు ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం.. 11 మందికి శౌర్య పతకం

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం పోలీసు సేవా పతకాలను ప్రకటించింది. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పోలీసు సేవా పతకాలను ప్రకటిస్తూ హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. పోలీసుశాఖలో పనిచేసే గ్రేహౌండ్స్‌కు చెందిన 9 మందికి శౌర్య పతకం దక్కింది. 16 మంది మహోన్నత సేవా పతకం, 92 మంది ఉత్తమ సేవా పతకం, 47 మంది కఠిన సేవా పతకం, 461 మంది సేవా పతకం అందుకోనున్నారు. ఇక అవినీతి నిరోధక శాఖలో ఒకరికి మహోన్నత సేవా, నలుగురికి ఉన్నత సేవా, 17 మందికి సేవా పతకాలు దక్కాయి. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖలో ఒకరికి ఉత్తమ సేవా, ఐదుగురికి సేవా పతకాలు వచ్చాయి. డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ సర్వీస్ శాఖలో ఇద్దరికి శౌర్య పతకం, ఒకరికి మహోన్నత పతకం, ముగ్గురికి ఉత్తమ సేవా, 14 మందికి సేవా పతకాలు దక్కాయి. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌లో ఒకరికి మహోన్నత సేవా, ముగ్గురికి ఉత్తమ సేవా, 15 మందికి సేవా పతకాలను ప్రభుత్వం ప్రకటించింది.




# విందులు, వినోదాల కోసమే అందాల పోటీలు పెట్టారు : హరీశ్‌రావు

సిద్దిపేట: జగదేవ్‌పూర్ మండలం తీగుల్‌లో ఏర్పాటు చేసిన భారాస కార్యాలయాన్ని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రారంభించారు. కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తెలుగుతల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ''అందాల పోటీలకు రూ.200కోట్లు ఖర్చు పెట్టారు. అనుచితంగా ప్రవర్తించినట్టు మిస్ ఇంగ్లాండ్ ఆరోపించారు. విందులు, వినోదాల కోసమే అందాల పోటీలు పెట్టారు. ఆ పోటీల వల్ల రాష్ట్రానికి చెడ్డ పేరు మాత్రమే. మూసీ పునరుద్ధరణ, హైడ్రా అని అన్నీ వదిలేశారు. రాజీవ్ యువశక్తి పేరుతో కాంగ్రెస్ కార్యకర్తలకే లబ్ధి చేకూరుతుంది. ఉద్యమ సమయంలో ఎంతో స్ఫూర్తినిచ్చిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చారు. ఇదేనా రేవంత్‌రెడ్డి తెచ్చిన మార్పు? కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తామంటున్నారు. రైతు బంధు, కల్యాణ లక్ష్మి, జిల్లాకో మెడికల్ కాలేజీ ఇచ్చారు.. రద్దు చేస్తారా? అద్భుతమైన సచివాలయం కట్టారు అది తీసేస్తారా? 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేశారు. అది తొలగిస్తారా? దేవుడి మీద ఒట్టు పెట్టి మాట తప్పిన వ్యక్తి సీఎం రేవంత్‌రెడ్డి'' అని హరీశ్‌రావు విమర్శించారు.



# ఆ టెండర్లు రద్దు చేయాలి: సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ కవిత లేఖ

హైదరాబాద్: జీహెచ్ఎంసీలో మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్స్ టెండర్లు రద్దు చేయాలని భారాస ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. ఈమేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ''జీహెచ్ఎంసీలో వర్షాకాలం పనుల టెండర్లలో గోల్‌మాల్ జరిగింది. ఇన్‌స్టంట్ రిపేర్ టీమ్స్ టెండర్లు రద్దు చేయాలి. కొందరు అధికారులు అనుకూల సంస్థలకు లబ్ధి చేకూర్చేందుకు యత్నించారు. తెలంగాణ బీసీ కాంట్రాక్టర్లకు నష్టం చేసేలా సిబ్బంది వ్యవహారం ఉంది. విదేశీ సంస్థ వాహనాలే వాడేలా నిబంధనలు రూపొందించారు. ఒక సంస్థ, రెండు ఏజెన్సీలకు లబ్ధి కలిగేలా నిబంధనలు మార్చారు. నిబంధనల మార్పుతో జీహెచ్ఎంసీపై ఏటా రూ.5.85 కోట్ల అదనపు భారం పడనుంది. ప్రస్తుతం తొమ్మిది జోన్ల వారీగా టెండర్లు పిలుస్తున్నారు. టెండర్ల నిబంధనల్లో మార్పుతో తెలంగాణ కాంట్రాక్టర్లకు నష్టం జరుగుతుంది'' అని లేఖలో పేర్కొన్నారు.



# మీనాక్షి నటరాజన్‌తో మంత్రి సీతక్క ప్రత్యేక భేటీ

తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్‌ను ఆదివారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్ ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మీనాక్షి కలిసిన మంత్రి సీతక్క ప్రత్యేకంగా భేటీ అయ్యారు. మీనాక్షి తాజా రాజకీయ పరిస్థితులపై సీతక్కతో సమీక్షించారు. ఈ సందర్భంగా తనకు పొలిటికల్ అఫైర్స్ కమిటీలో స్థానం కల్పించినందుకు మీనాక్షి నటరాజన్‌కు మంత్రి సీతక్క ధన్యవాదాలు తెలిపారు.



# ఈ నెల 5న కేబినెట్ భేటీ

ఈ నెల 5న తెలంగాణ కేబినెట్ సమావేశం నిర్వహించి కీలక అంశాలను చర్చించాలని మంత్రుల సమావేశంలో నిర్ణయించారు. ఇవాళ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంత్రులతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. రాష్ట్ర అవతరణ వేడుకలు, ఇందిరమ్మ ఇండ్లు, రెవెన్యూ సదస్సులు, వానకాలం పంటల సాగు సన్నద్ధత, రాజీవ్ యువ వికాసం అంశాలపై మంత్రులు అందించిన నివేదికపై సమావేశంలో చర్చించారు. మే 29, 30 తేదీలలో జిల్లాల్లో పర్యటించిన మంత్రులు ఈ నాలుగు అంశాలపై అధికారులతో సమీక్షలు నిర్వహించారు. అవతరణ దినోత్సవ వేడుకల ఏర్పాట్లతో పాటు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల తుది జాబితాలు, రెవిన్యూ సదస్సుల నిర్వహణ ఏర్పాట్లపై జిల్లాల వారీగా తయారు చేసిన నివేదికలపై సమావేశంలో వివరించారు. రాజీవ్ యువ వికాసానికి ఊహించినదానికంటే ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయని, అనర్హులకు యువ వికాసం అందకుండా చూడాలని పెద్ద ఎత్తున ఫిర్యాదులు వచ్చాయని మంత్రులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పెద్ద సంఖ్యలో వచ్చిన దరఖాస్తుల స్క్రీనింగ్ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో పూర్తి స్థాయి పరిశీలన తరువాతే అర్హుల జాబితాలను ప్రకటించాలని నిర్ణయించారు. మరింత లోతుగా విశ్లేషించి లబ్ధి దారులను గుర్తించాలని నిర్ణయించాలన్నారు. ఒక్క అనర్హుడికి కూడా రాజీవ్ యువ వికాసం ద్వారా లబ్ధి చేకూరవద్దన్నారు. ఈ అంశంపై కేబినెట్ లో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. ఉద్యోగుల సమస్యలపై నియమించిన కమిటీకి సంబంధించి అధికారులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఇప్పటికే నివేదిక అందించారు. ఆ నివేదికపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రులకు వివరించారు. దీనిపై కేబినెట్ లో చర్చించి సమస్యల పరిష్కారంపై ఎలా ముందుకెళ్లాలో నిర్ణయం తీసుకోనున్నారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నందుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని మంత్రులు అభినందించారు.



# ఈశాన్యంలో భారీ వర్షాలు.. 'డేంజర్' లెవల్‌లో బ్రహ్మపుత్ర!

ఈశాన్య రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. అస్సాం, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్‌లలోని అనేక జిల్లాల్లో వరదల ప్రభావం అధికంగా ఉంది. పలుచోట్ల బ్రహ్మపుత్ర నది ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో పాటు మణిపుర్ గవర్నర్‌తో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. అస్సాంలోని 15 జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దాదాపు 78వేల మంది తీవ్రంగా ప్రభావితమైనట్లు అంచనా. రోడ్డు, రైలు, ఫెర్రీ సర్వీసులకు అంతరాయం కలుగుతోంది. డిబ్రూగఢ్ జిల్లాలో బ్రహ్మపుత్ర ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. గువాహటిలో ఆదివారం కూడా ఎడతెరిపిలేని వర్షం కురిసింది. వర్షాల కారణంగా రాష్ట్రంలో ఇప్పటివరకు ఎనిమిది మంది చనిపోయినట్లు అధికారులు వెల్లడించారు. సిక్కింలోనూ రెండు మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. మంగన్ జిల్లాలోని లాచెన్, లాచుంగ్ లోయ ప్రాంతాల్లో దాదాపు 1200లకుపైగా పర్యటకులు చిక్కుకుపోయినట్లు అంచనా. వర్షం తగ్గకపోవడం, తీస్తా నదిలో నీటిమట్టం



పెరగడంతో రెస్క్యూ ఆపరేషన్‌కు ఆటంకం కలుగుతున్నట్లు సమాచారం. మున్షితాంగ్ సమీపంలో మే 29న తీస్తా నదిలోకి ఓ వాహనం దూసుకెళ్లగా.. ఆ ఘటనలో ఎనిమిది మంది పర్యటకుల ఆచూకీ ఇంకా తెలియలేదు. దజోంగు నియోజకవర్గంలో కీలక మార్గంగా ఉన్న ఫిడాంగ్ బైలీ వంతెన అడుగుభాగం భారీ వరదలకు తీవ్రంగా దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. అదే ప్రాంతం ఎగువ భాగంలో కొండచరియలు విరిగిపడటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అరుణాచల్ ప్రదేశ్‌లో కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పలుచోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. సిగిన్ నది ఉప్పొంగి ప్రవహిస్తోండడం డజోరిజోలో ఆకస్మిక వరదలకు కారణమైంది. మణిపుర్‌లోనూ నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. గత రెండు రోజుల్లోనే దాదాపు 900 ఇళ్లు దెబ్బతిన్నట్లు అంచనా. ఖురియా, చెకొన్ సహా తూర్పు ఇంఫాల్‌లో అనేక ప్రాంతాలు ముంపునకు గురైనట్లు అధికారులు వెల్లడించారు.

# ఎవరీ శర్మిష్ఠ పనోలీ.. పోలీసులు ఎందుకు అరెస్టు చేశారు?



కోల్‌కతా: 'ఆపరేషన్ సిందూర్' సమయంలో సోషల్ మీడియాలో అభ్యంతరకరమైన వ్యాఖ్యలతో వీడియోను పోస్టు చేశారన్న ఆరోపణలపై జైలు పాలైంది 22 ఏళ్ల న్యాయ విద్యార్థిని, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ శర్మిష్ఠ పనోలీ. మే 14న ఆమె పోస్టు చేసిన వీడియో తీవ్ర వివాదస్పదం కావడంతో కోల్‌కతా పోలీసులు ఆమెను గురుగ్రామ్‌లో శుక్రవారం రాత్రి అరెస్టు చేశారు. అనంతరం శనివారం ఆమెను కోల్‌కతాలోని కోర్టులో హాజరుపరచగా.. 14 రోజుల పాటు జ్యుడిషియల్ కస్టడీ విధించడంతో జైలుకు తరలించారు.

**ఎవరీ శర్మిష్ఠ?**

కోల్‌కతాలోని ఆనందపుర్ ప్రాంతానికి చెందిన శర్మిష్ఠ పనోలీ.. పుణెలో న్యాయ విశ్వవిద్యాలయంలో నాలుగో సంవత్సరం విద్యార్థిని. లింక్డిన్ ప్రొఫైల్ ప్రకారం.. ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో 94వేల మంది ఫాలోవర్లు ఉన్నారు. రాజకీయాలకు సంబంధించి తనదైన శైలిలో వ్యాఖ్యానాలు జోడించి తన అభిప్రాయాలను బలంగా చెప్పడం ద్వారా పాపులర్‌గా మారి సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారింది.

**ఏం మాట్లాడింది?**

భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌పై బాలీవుడ్ ప్రముఖుల మౌనాన్ని ప్రశ్నిస్తూ చేసిన వీడియోలో కొందరి మనోభావాలను కించపరిచారన్న అభియోగాల నేపథ్యంలో తాజా పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ వీడియోలో ఆమె వ్యాఖ్యలు చేయడంతో పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో ఆమె తన పోస్టులు, రీల్స్‌ను తొలగించి క్షమాపణలు చెప్పింది. అయితే, శర్మిష్ఠను అరెస్టు చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్లు వచ్చిన నేపథ్యంలో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు రంగంలోకి దిగారు.

**పోలీసులు ఏం చెప్పారు?**

ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన పోస్టు ద్వారా శర్మిష్ఠపై పలు సెక్షన్ల కింద కోల్‌కతా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. శర్మిష్ఠకు, ఆమె కుటుంబ సభ్యులకు లీగల్ నోటీసులు ఇచ్చినా హాజరు కాలేదని, పైగా కుటుంబంతో కలిసి ఎక్కడికి వెళ్లిపోయారంటూ కోర్టుకు తెలిపారు. దీంతో కోల్‌కతా న్యాయస్థానం శర్మిష్ఠకు అరెస్టు వారెంట్ జారీ చేయడంతో ఆమె గురుగ్రామ్‌లో ఉన్నట్టు ట్రాక్ చేసిన పోలీసులు.. శుక్రవారం అరెస్టు చేసినట్లు వెల్లడించారు. అయితే, పోలీసులు ఇప్పటికే అన్ని డిజిటల్ ఆధారాలు స్వాధీనం చేసుకున్నందున కస్టడీ అవసరం లేదని శర్మిష్ఠ తరఫు న్యాయవాది చేసిన వాదనను కోర్టు తిరస్కరించింది. మరోవైపు, కోల్‌కతా పోలీసులు తాము సరైన ప్రక్రియనే అనుసరించామని, కోర్టు వారెంటు ఆధారంగానే చట్టబద్ధంగానే ఆమెను అరెస్టు చేశామని సమర్థించుకున్నారు.

# ఐఈడీ బాంబులను నిర్వీరం చేసిన భద్రతా బలగాలు



భద్రాచలం: ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో 10 ఐఈడీ బాంబులను భద్రతా బలగాలు నిర్వీర్యం చేశాయి. పోలీసులను లక్ష్యంగా చేసుకొని మావోయిస్టులు అమర్చిన 10 మందుపాతరలను తొలగించారు. కోహకమేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోడాపారా, గుర్మా అటవీప్రాంతంలో మందుపాతలను గుర్తించిన బలగాలు.. వాటిని వెలికితీశాయి. ఒక్కొక్కటి ఐదు కిలోలకుపైగా బరువు ఉన్నట్లు గుర్తించారు. మావోయిస్టులకు భద్రత బలగాలకు ఎదురు కాల్పులు జరుగుతోన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో అడవుల్లోకి కూంబింగ్‌కు వచ్చే భద్రతా బలగాలను హతమార్చడానికి మావోయిస్టులు దారి పొడవునా ఐఈడీలను అమర్చారు. ఈ నేపథ్యంలో భద్రతా బలగాలు కూంబింగ్ వెళ్తూ మందుపాతలను గుర్తించి నిర్వీర్యం చేశాయి.

# 'మాలో చీలిక తెచ్చేందుకు కుట్ర'.. మౌనం వీడిన తేజ్‌ప్రతాప్




బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాష్ట్రీయ జనతాదళ్‌లో ఇటీవల కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. పార్టీ నుంచి తన పెద్ద కుమారుడు, మాజీ మంత్రి తేజ్ ప్రతాప్ యాదవ్‌ను బహిష్కరిస్తున్నట్లు ఆ పార్టీ అధినేత లాలూ ప్రసాద్ ప్రకటించిన సంగతి తెలిసిందే. వీటిపై తేజ్ ప్రతాప్ మౌనం వీడారు. తనకు, తన తమ్ముడు తేజస్వీ యాదవ్‌ల మధ్య చిచ్చు పెట్టేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు. "మా మధ్య చీలిక వస్తుందని కలలు కంటున్న వారు ఎన్ని కుట్రలు చేసినా విజయం సాధించలేరు. వాటన్నింటినీ త్వరలోనే బయటపెడుతా. అన్నివేళలా తోడుగా ఉంటాననే భరోసాను నీకు (తేజస్వీని ఉద్దేశిస్తూ) ఇస్తున్నా. అమ్మా, నాన్నలను జాగ్రత్తగా చూసుకో. జైచంద్ లాంటి వాళ్లు ఇంట్లో, బయట ఉన్నారు" అని తేజ్ ప్రతాప్ పేర్కొన్నారు. అంతకుముందు లాలూ, రబ్రీదేవీలను ఉద్దేశిస్తూ ఎక్స్‌లో స్పందించిన తేజ్ ప్రతాప్.. జైచంద్ వంటి వారు తనపై కుట్రలు చేశారని ఆరోపించారు. తల్లిదండ్రుల ప్రేమ, విశ్వాసం మాత్రమే తనకు కావాలని, మరేదీ వద్దని చెప్పారు. తాను రిలేషన్‌షిప్‌లో ఉన్నానంటూ తేజ్ ప్రతాప్ ఫేస్‌బుక్‌లో పెట్టిన ఓ పోస్టు సామాజిక మాధ్యమాల్లో ఇటీవల వైరల్‌గా మారింది. అనుష్క అనే మహిళతో గత 12 ఏళ్లుగా రిలేషన్‌లో ఉంటున్నాన్నది దాని సారాంశం. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్.. పార్టీ నుంచి ఆరేళ్ల పాటు బహిష్కరించడంతోపాటు తమ కుటుంబంలోనూ తేజ్ ప్రతాప్‌కు స్థానం లేదని ప్రకటించారు.

# ఆపరేషన్ సిందూర్‌పై 'వ్యాసరచన' పోటీ.. ప్రైజ్ మనీ ఎంతంటే!




పాకిస్థాన్ ఉగ్ర స్థావరాలే లక్ష్యంగా భారత సైన్యం 'ఆపరేషన్ సిందూర్'ను చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో రక్షణశాఖ కీలక ప్రకటన చేసింది. ఈ ఆపరేషన్‌కు సంబంధించి యువత మనసులోని భావాలను వినిపించేందుకు ఓ అవకాశం కల్పించింది. ఇందుకోసం ఆన్‌లైన్‌లో వ్యాసరచన పోటీని నిర్వహిస్తున్నట్లు ప్రకటించింది. జూన్ 1 నుంచి 30వ తేదీ వరకు ఈ వ్యాసరచన పోటీ అందుబాటులో ఉంటుంది. ఒకరు ఒకేసారి పాల్గొనవచ్చు. ఇంగ్లిష్, హిందీ భాషల్లో రాసేందుకు మాత్రమే వీలుంది. 500 నుంచి 600 పదాల్లోనే ఉండాలి. ఇందులో ముగ్గురు విజేతలకు రూ.10వేల చొప్పున ప్రైజ్ మనీ ఇవ్వనున్నారు. దీంతోపాటు టాప్‌లో నిలిచిన 200 మందికి (వీరికి తోడుగా మరొకరికి) దిల్లీలోని ఎర్రకోటలో జరిగే 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు అవకాశం కల్పించనున్నట్లు రక్షణశాఖ వెల్లడించింది. ఇందుకోసం mygov.in లో లాగిన్ అయ్యి వ్యాసరచన పోటీల్లో పాల్గొనవచ్చు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. ఇందులో భాగంగా పాకిస్థాన్‌తోపాటు పీవోకేలో తొమ్మిది ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసింది. వీటితోపాటు పలు పాక్ వైమానిక స్థావరాలను కూడా తీవ్రంగా దెబ్బతీసింది. సీమాంతర ఉగ్రవాదాన్ని సహించేది లేదన్న భారత ప్రధాని నరేంద్ర మోదీ.. సరికొత్త పంథాతో పాక్ ఉగ్రవాదానికి ఒక 'రెడ్‌లైన్' గీశామని ఉద్ఘాటించారు.

# దేశంలో 3,758కి చేరిన కొవిడ్ యాక్టివ్ కేసులు.. ఈ వైరస్‌పై WHO ఏం చెప్పిందంటే?

దేశంలో కొవిడ్ వ్యాప్తి రోజురోజుకీ పెరుగుతోంది. కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించిన గణాంకాల ప్రకారం జూన్ 1న ఉదయం 8గంటల వరకు దేశ వ్యాప్తంగా క్రియాశీల కేసుల సంఖ్య 3,758కి పెరిగింది. వీటిలో అత్యధికంగా కేరళలోనే 1400 కేసులు ఉండగా.. మహారాష్ట్రలో 485, దిల్లీ 436, గుజరాత్ 320, పశ్చిమ బెంగాల్ 287, కర్ణాటక 238, ఆంధ్రప్రదేశ్ 23, తెలంగాణ 3 చొప్పున.. ఇలా పలు రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో మొత్తంగా 3758 యాక్టివ్ కేసులు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. అలాగే, ఈ ఏడాది కొవిడ్ సంబంధిత మరణాలు 28కి చేరాయి.

**డబ్ల్యూహెచ్‌వో ఏమందంటే?**

కొవిడ్ మళ్లీ వ్యాప్తి చెందుతుండటంపై ప్రపంచ ఆరోగ్యసంస్థ (WHO) ఇటీవల స్పందించింది. వ్యాప్తిలో ఉన్న ఎల్ఎఫ్.7, ఎన్‌బీ.1.8.1 సబ్ వేరియంట్లను 'పర్యవేక్షణలో ఉన్న వేరియంట్లు'గా వర్గీకరించింది. పలు దేశాల్లో విస్తృతంగా వ్యాప్తి చెందుతున్న ఎన్‌బీ.1.8.1 వేరియంట్‌తో ఇన్ఫెక్షన్ల వ్యాప్తి, ఆస్పత్రుల్లో చేరికలు ఒకేసారి పెరుగుతున్నా.. ప్రస్తుతం అందుబాటులో ఉన్న డేటా ప్రకారం ఇతర వేరియంట్లతో పోలిస్తే ఇది తీవ్రమైన అనారోగ్యానికి దారితీస్తుందన్న సూచనలు ఏమీ లేవని మే 23న పేర్కొంది. ఇప్పటికే ఆమోదం పొందిన కొవిడ్ వ్యాక్సిన్లు ఈ వేరియంట్ లక్షణాలు, ప్రభావాన్ని కట్టడి చేయడంలో సమర్థంగా పనిచేస్తాయని భావిస్తున్నట్లు తెలిపింది.

*** ఇన్ఫెక్షన్ తీవ్రత తక్కువే.. అప్రమత్తంగా ఉండాలి: ఐసీఎంఆర్**

మరోవైపు, ఐసీఎంఆర్ వెల్లడించిన సమాచారం ప్రకారం.. దేశంలోని పశ్చిమ, దక్షిణ ప్రాంతాల్లో జీనోమ్ సీక్వెన్సింగ్ నమూనాల ద్వారా ఈ కొత్త వేరియంట్లు ఒమిక్రాన్ జాతికి చెందిన ఉప రకాలుగా తేలింది. 2022లో ప్రపంచ వ్యాప్తంగా కొవిడ్ శరవేగంగా విస్తరించడానికి ఒమిక్రాన్ కారణమన్న విషయం తెలిసిందే. అయితే, ఎల్ఎఫ్.1, ఎక్స్‌ఎఫ్‌జీ, జేఎన్. 1, ఎన్‌బీ. 1.8.1 వంటి వేరియంట్లను మన దేశంలో గుర్తించగా.. వీటిలో మొదటి మూడు వేరియెంట్లే ప్రబలంగా ఉన్నట్లు ఐసీఎంఆర్ చీఫ్ రాజీవ్ బహల్ ఇటీవల తెలిపారు. కొవిడ్ కేసుల పెరుగుదలపై ఇటీవల రాజీవ్ బెహల్ 'పీటీఐ'వార్తా సంస్థతో మాట్లాడుతూ..తొలుత దక్షిణభారతదేశం నుంచి నమోదైన కేసులు.. ఆ తర్వాత పశ్చిమం నుంచి, ఇప్పుడేమో ఉత్తర భారతం నుంచి వస్తున్నట్లు తెలిపారు. ఈ కేసులన్నింటినీ ఇంటిగ్రేటెడ్ డిసీజ్



సర్వైలెన్స్ ప్రోగ్రామ్ ద్వారా మోనిటరింగ్ చేస్తున్నామన్నారు. ప్రస్తుతానికి ఈ ఇన్‌ఫెక్షన్ల తీవ్రత తక్కువగా ఉందన్న ఆయన.. ఎలాంటి భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదన్నారు. "ఎప్పుడైనా ఇన్ఫెక్షన్లు పెరిగితే.. మూడు అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. వైరస్ వ్యాప్తి ఎంత మేరకు ఉంది అనేది మొదట చూడాలి. గతంలో కొవిడ్ 19 వచ్చినప్పుడు కేసులు రెండు రోజుల్లోనే రెట్టింపు కావడం మనం చూశాం. కానీ, ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఇక రెండోది, కొత్త వేరియంట్లు రోగనిరోధక శక్తిపై ఏమేరకు ప్రభావం చూపుతున్నాయనేది చూడాలి. మూడోది, వైరస్ తీవ్రత ఎంతో చూడాలి. గతంతో పోలిస్తే.. ఈ వేరియంట్‌లో అంత తీవ్రత కనబడటంలేదు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదుగానీ, అప్రమత్తంగా, సర్వసన్నద్ధతతో ఉండాలి'' అని సూచించారు.

# కొత్త కాపురం.. ఇంట్లో ఇవి ఉండాలట!

**కొత్త జంట.. కొత్త కాపురం.. కొత్త ఇల్లు.. అప్పుడే వైవాహిక బంధంలోకి అడుగుపెట్టిన జంటలకు తమ జీవితంలో అన్నీ కొత్త అనుభవాలే ఎదురవుతుంటాయి. ముఖ్యంగా తమ ఇంటిని తీర్చిదిద్దుకోవడంలో వారి మనసుల్లో కొంత సందిగ్ధత నెలకొంటుంది. ఎలాంటి ఫర్నిచర్ కొనాలి? ఏది అవసరం? ఏది అనవసరం? అన్న స్పష్టత కొంతమందికి ఉండదు. మరికొందరేమో.. 'అద్దె ఇల్లే కదా.. ఇప్పుడే అన్ని వస్తువులు కొనడం ఎందుకు?' అన్న ఆలోచనతో ఉంటారు. కానీ సొంతిల్లైనా, అద్దె ఇల్లైనా కొన్ని వస్తువుల్ని ఎంచుకోవడం, ఇంట్లో అమర్చుకోవడం తప్పనిసరి అంటున్నారు నిపుణులు. తద్వారా ఇల్లు అందంగా కనిపించడంతో**



* మనం ఎక్కువ సమయం గడిపేది, అతిథులొచ్చినా కూర్చునేది లివింగ్ రూమ్‌లోనే. కాబట్టి అక్కడి స్థలాన్ని బట్టి ఓ చక్కటి సోఫాసెట్‌ని ఏర్పాటుచేసుకోవాలి. ఇక బడ్జెట్ గురించి ఆలోచించే వారైతే కేన్, చెక్కతో తయారుచేసినవి అందుబాటు ధరల్లోనే దొరుకుతున్నాయి.
* ఇక లివింగ్ రూమ్ కాస్త పెద్దగా ఉన్న వారు.. అక్కడక్కడా సైడ్ ఛైర్స్ ఏర్పాటుచేస్తే.. ఎక్కువమంది అతిథులొచ్చినప్పుడు ఇబ్బంది పడకుండా జాగ్రత్తపడచ్చు.
* ఇంటికి కావాల్సిన అత్యవసర వస్తువుల్లో డైనింగ్ టేబుల్ ఒకటి. ఇది ఇంటికి కొత్త కళనూ తీసుకొస్తుంది. అయితే ప్రస్తుతం ఎవరి అవసరాలకు అనుగుణంగా వారు.. ఇద్దరు, నలుగురు, ఆరుగురు.. ఇలా కుటుంబ సభ్యుల సంఖ్యను బట్టి విభిన్న డైనింగ్ టేబుల్స్ మార్కెట్లో దొరుకుతున్నాయి. అంతేకాదు.. ఇరువైపులా / నాలుగువైపులా కుర్చీలుండి.. మరోవైపు బెంచ్ తరహాలో ఉండేవి కూడా లభ్యమవుతున్నాయి. ఇవేవీ వద్దనుకునే వారు.. ఇంట్లో స్థలాన్ని ఆదా చేసుకోవాలనుకునే వారు.. గోడకు ఫోల్డింగ్ తరహాలో ఉండేలా ఓ వాల్‌మౌంటెడ్ చెక్కను ఫిట్ చేయించుకొని.. ఇరువైపులా రెండు కుర్చీలూ వేసుకోవచ్చు.. అవసరం లేనప్పుడు ఆ చెక్కను ఫోల్డ్ చేసుకోవచ్చు.
* ప్రస్తుతం చాలామంది ఇంటీరియర్స్‌కే ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నారు. ఈ క్రమంలో డ్రెస్సింగ్ టేబుల్ విషయంలోనూ పలు మార్పులు చేర్పులు చేసుకుంటున్నారు. దీనికి బదులు ఇంట్లోనే తమకు అనువైన చోట ఓ మిర్రర్ ఏర్పాటుచేయించుకొని.. దానికి కింది భాగంలో ఓ వాల్ మౌంటెడ్ ర్యాక్‌ని ఏర్పాటు చేసుకుంటే బడ్జెట్ ఆదా అవుతుంది. అంతేకాదు.. ఇల్లు మారేటప్పుడు సులభంగానూ ఉంటుంది.
* తక్కువ స్థలంలో ఇమిడిపోవాలి.. ఎక్కువ స్టోరేజ్ అమర్చుకునేలా ఉండాలి.. ఏ ఫర్నిచర్ కొన్నా మనం ఇదే విషయం గుర్తుపెట్టుకుంటాం. అందుకే మన ఆలోచనలు, అభిరుచుల్ని బట్టే ఇంటీరియర్ డిజైనింగ్ సంస్థలు ప్రస్తుతం స్టోరేజ్ బెడ్స్, సోఫాసెట్స్, కాఫీ టేబుల్స్.. వంటివెన్నో రూపొందిస్తున్నాయి. కాబట్టి ఇంట్లో స్థలాన్ని బట్టి ఆయా సైజుల్లో ఉండే స్టోరేజ్ వస్తువుల్ని ఎంచుకుంటే ఇల్లు నీట్‌గా కనిపిస్తుంది.
* వంటగదిలో ఎన్ని అరలున్నా సరిపోవు. నిజానికి మన సొంతిల్లైతే ఉన్న వస్తువుల్ని బట్టి షెల్ఫులు డిజైన్ చేయించుకుంటాం. అద్దె ఇంట్లో ఈ సౌలభ్యం ఉండదు. కాబట్టి ఇలాంటప్పుడు కిచెన్ ట్రాలీస్ చక్కటి ప్రత్యామ్నాయం. పైగా ఇవి తక్కువ ధరలోనే దొరుకుతున్నాయి. ఇంటికి కొత్త అందాన్నీ తీసుకొస్తాయి. ఇక వీటిని నేలపైనైనా అమర్చుకోవచ్చు.. లేదంటే వాల్ మౌంటెడ్‌గానైనా ఏర్పాటుచేసుకోవచ్చు.
* ఇంటి నుంచి పనిచేసే వారు ప్రత్యేకంగా ఓ గదినే ఆఫీస్ రూమ్‌గా కేటాయించుకోవడం మనం చూస్తుంటాం. అయితే అందరికీ ఆ వెసులుబాటు ఉండకపోవచ్చు. కాబట్టి అలాంటి వారు స్లీక్ టేబుల్, దానికి అనుబంధంగా వచ్చిన కుర్చీ సెట్‌ని ఎంచుకోవచ్చు. దీనివల్ల ఇంట్లో స్థలమే కాదు.. బడ్జెట్ కూడా ఆదా అవుతుంది.





# రేఖా చిత్రం కాదు... ప్రకృతి విచిత్రం

**పూలు ఎలా విచ్చుకున్నా అందంగానే ఉంటాయి. కానీ ఈ పూలు విచ్చుకున్న తీరు చూస్తే చిత్రంగా కూడా అనిపిస్తుంది. అదేదో జ్యామెట్రీ బాక్సు దగ్గర పెట్టుకుని ప్రకృతి పక్కాగా గీసిన బొమ్మలా అనిపిస్తుంది కదా ఈ పువ్వు. అందుకే దీనికి 'పింక్ పర్‌ఫెక్షన్' అనే పేరు వచ్చింది. ఈ పువ్వు ఇలా ఒక క్రమ పద్ధతిలో విచ్చుకోవడం వెనక ఫెబోనాకీ, గోల్డెన్ యాంగిల్ సిద్ధాంతం ఉంది. పూలల్లో కొన్ని జాతులకి ఒక లెక్క ప్రకారం రేకులు ఉంటాయి. అవి కూడా ప్రత్యేక కోణంలో అమరి ఉంటాయి. అవి విచ్చుకున్నప్పుడు ఇలా అందంగా కనిపిస్తాయి. కలువ, పైనాపిల్ ఆకులు, సన్‌ఫ్లవర్ పూల మధ్య భాగంలోని గింజలు కూడా ఈ పద్ధతిలోనే**









# నికెల్‌ని పండిస్తున్నారు....

బంగారం, వెండి, రాగి... ఇలా మనకి ఏ లోహాలు కావాలన్నా భూమిని తవ్వాలి. టన్నుల కొద్దీ తవ్విన మట్టిని శుద్ధి చేస్తేనే లోహాలు మనచేతికందుతాయి. అలా కాకుండా ఈ లోహాలని సాగుచేసి పండిస్తే ఎలా ఉంటుంది? అదెలా సాధ్యం అంటారా... సాధ్యమే, ఎందుకంటే మలేషియా ప్రభుత్వం నికెల్ పంటని ఇప్పటికే సాగుచేస్తోంది మరి. మైనింగ్ వల్ల ప్రకృతి పచ్చదనాన్ని కోల్పోవడం, నేల కలుషితం అవడం, ప్రజలకు ప్రాణాంతక జబ్బులు రావడం జరుగుతోంది. అలాకాకుండా పర్యావరణహితంగా మైనింగ్ చేయాలనుకున్న మలేషియా ప్రభుత్వానికి వచ్చిన ఆలోచనే ఫైటోమైనింగ్. అదెలాగంటే... ప్రకృతిలో కొన్ని చెట్లకి భూమిలో ఉన్న లోహాలని పెద్దఎత్తున గ్రహించే శక్తి ఉంది. వాటినే హైపర్ ఎక్యుమలేటర్స్ అంటారు. ఈ జాతి చెట్లు లోహాలని గ్రహించి ఆకుల్లో, బెరడులో దాచుకుంటాయి. భూమిని తవ్వే పనిలేకుండా ఈ చెట్ల నుంచి లోహాలను గ్రహించడాన్ని ఫైటోమైనింగ్ అంటారు. మలేషియాలోని కినబాలు పర్వత ప్రాంతంలో ఫైలాంతస్ రుఫుశ్చునేయి అనే రకం మొక్కకి నికెల్, కోబాల్ట్ వంటి లోహాలని గ్రహించే శక్తి ఉంది. దాంతో అక్కడి ప్రభుత్వం నికెల్‌ని తవ్వితీసే పనిలేకుండా ఈ చెట్లని పెద్దఎత్తున సాగు చేసింది. వచ్చే ఏడాదికల్లా నికెల్ పంట చేతికొస్తుందని ఎదురుచూస్తోంది.








## ఒకే సినిమాకు రెండు క్లైమాక్స్‌లు..

### 'హౌస్‌ఫుల్ 5' కొత్త ప్రయోగం!




**టాకీస్:** బాలీవుడ్ కామెడీ ఫ్రాంచైజీ సిరీస్‌లో భాగంగా వస్తున్న 'హౌస్‌ఫుల్ 5' ఒక కొత్త ప్రయోగానికి సిద్ధమైంది. సాధారణంగా ఏ సినిమాకు అయిన ఒకే క్లైమాక్స్ ఉంటుందన్న విషయం తెలిసిందే. అయితే, ఈ సినిమా మాత్రం రెండు వేర్వేరు క్లైమాక్స్‌లతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ విషయాన్ని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. హౌస్‌ఫుల్ 5ఏ, హౌస్‌ఫుల్ 5బీ అనే రెండు వెర్షన్లలో సినిమా విడుదల కానుంది. ఈ రెండు వెర్షన్లలో కేవలం క్లైమాక్స్‌లు మాత్రమే కాదు, 'కిల్లర్స్' (సినిమాలోని విలన్ పాత్రలు) కూడా భిన్నంగా ఉంటాయని తెలుస్తోంది.

సాజిద్ నదియాద్‌వాలా నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ కామెడీ ఎంటర్‌టైనర్‌లో అక్షయ్ కుమార్, అభిషేక్ బచ్చన్, రితీష్ దేశ్‌ముఖ్, నానా పటేకర్ వంటి స్టార్ నటీనటులు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే సినిమా నుండి విడుదలైన "ఫుగ్గీ డ్యాన్స్" వంటి పాటలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. జూన్ 6, 2025న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న 'హౌస్‌ఫుల్ 5' ఈ వినూత్న ప్రయోగంతో ప్రేక్షకులను ఎంత వరకు ఆకట్టుకుంటుందో వేచి చూడాలి.

## రొమ్ము క్యాన్సర్‌ను జయించిన మిస్ వరల్డ్..

# సుచాత ప్రస్థానం

పదహారేళ్ల వయసులో రొమ్ము క్యాన్సర్.. సకాలంలో గుర్తించడంతో కోలుకున్నట్లు వెల్లడి

'పాల్ ఫర్ హర్' పేరుతో రొమ్ము క్యాన్సర్ పై అవగాహన కల్పిస్తున్న సుచాత

థాయ్ లాండ్ లోని పుకెట్ లో జననం, బ్యాంకాక్ లో ఉన్నతవిద్య




హైదరాబాద్: హైదరాబాద్ లోని హైటెక్స్ వేదికగా జరిగిన మిస్ వరల్డ్ పోటీల్లో థాయ్ లాండ్ సుందరి ఓపల్ సుచాతా చువాంగ్ శ్రీ టైటిల్ గెల్చుకున్న విషయం తెలిసిందే..

**సుచాత గురించి మరిన్ని ఆసక్తికర విశేషాలు..**

థాయ్ లాండ్ లోని పుకెట్ లో సుచాత జన్మించారు. ఆమె తల్లిదండ్రులు తానెట్ డోంక్‌మనెర్డ్, సుపత్రా చువాంగ్ శ్రీ. చువాంగ్ శ్రీ కుటుంబానికి థాలాంగ్‌లో వ్యాపారం ఉంది. ప్రాథమిక విద్యాభ్యాసం పుకెట్ లోనే పూర్తిచేసిన సుచాత.. బ్యాంకాక్ లో ఉన్నత విద్య పూర్తిచేశారు. ప్రస్తుతం బ్యాంకాక్ లోని థమ్మసాట్ యూనివర్సిటీలో పొలిటికల్ సైన్స్ లో బ్యాచిలర్ డిగ్రీ చదవుతున్నారు. మిస్ వరల్డ్ కిరీటంతో పాటు ఓపల్ సుచాతా 1 మిలియన్ అమెరికన్ డాలర్లు (సుమారు 8.5 కోట్ల భారతీయ రూపాయలు) ప్రైజ్ మనీగా అందుకున్నారు. ఓపల్ సుచాతా గత నాలుగేళ్లుగా మోడలింగ్ రంగంలో ఉన్నారు. ఆమె తన అందాల పోటీల ప్రస్థానాన్ని 2021లో మిస్ రత్తనకోసిన్ పోటీలతో ప్రారంభించారు. 2022లో మిస్ యూనివర్స్ థాయ్‌లాండ్ పోటీల్లో పాల్గొని మూడో స్థానంలో నిలిచారు. ఆ తర్వాత రెండో రన్నరప్ తప్పుకోవడంతో ఆమె రెండో స్థానానికి ప్రమోట్ అయ్యారు.

**పదహారేళ్ల వయసులో రొమ్ము క్యాన్సర్..**

ఓపల్ సుచాతా బ్రెస్ట్ ట్యూమర్‌ను జయించారు. 16 ఏళ్ల వయసులో తన రొమ్ములో కణితిని గుర్తించగా, సకాలంలో చికిత్స తీసుకోవడంతో కోలుకున్నారు. ఆ సమయంలో తన శారీరక, మానసిక అవస్థ వర్ణనాతీతమని సుచాత చెప్పారు. మహిళలను వేధించే ఈ సమస్యను దూరం చేయాలంటే ప్రజల్లో అవగాహన చాలా అవసరమని గుర్తించి, 'పాల్ ఫర్ హర్' పేరుతో రొమ్ము క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. మానసిక శాస్త్రం, ఆంత్రోపాలజీపై ఆసక్తి కలిగిన ఓపల్, యువతులలో విద్యను ప్రోత్సహించడానికి కూడా కృషి చేస్తున్నారు. సుచాత జంతుప్రేమికురాలు.. తన ఇంట్లో 16 పిల్లులు, ఐదు కుక్కలను ఆమె పెంచుకుంటున్నారు.




## అఖిల్ 'లెనిన్'లో అనన్య పాండే స్పెషల్ సాంగ్?

**టాకీస్:** టాలీవుడ్ యువ హీరో అక్కినేని వారసుడు అఖిల్ తన కెరీర్‌లో ఒక్క బ్లాక్‌బస్టర్ హిట్ అయిన కొట్టాలని ఎంతగానో ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. గత చిత్రం 'ఏజెంట్' ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో, తన తదుపరి సినిమాల విషయంలో అఖిల్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాడు. ఈ క్రమంలోనే ఆయన ఒక కొత్త దర్శకుడితో సినిమా చేస్తున్నాడు. అఖిల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ తాజా చిత్రం పేరు 'లెనిన్'.





ఈ సినిమాకు మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వం వహిస్తుండగా, అఖిల్ సొంత నిర్మాణ సంస్థ అన్నపూర్ణ స్టూడియోస్‌తో పాటు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై అక్కినేని నాగార్జున, నాగ వంశీ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే నుంచి టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేయగా.. రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్న ఈ గ్లింప్స్ ఆకట్టుకుంది. అయితే ఈ సినిమాకు సంబంధించి ఒక వార్త వైరల్‌గా మారింది. ఈ సినిమాలో ఒక స్పెషల్ సాంగ్ ఉండగా.. ఆ సాంగ్‌ని బాలీవుడ్ నటి అనన్య పాండేతో చేయిస్తే బాగుంటుందని చిత్రబృందం అనుకుంటున్నట్లు సమాచారం. కాగా దీనిపై అధికారికంగా ప్రకటన రావాల్సి ఉంది. ఇక ఈ చిత్రంలో శ్రీలీల కథానాయికగా నటిస్తుండగా, ఎస్. థమన్ సంగీతం అందిస్తున్నారు.

## మ్యాడ్ హీరో గ్యాంబ్లర్స్ ట్రైలర్ మామూలుగా లేదుగా..

**టాకీస్:** 'మ్యాడ్', 'మ్యాడ్ స్క్వేర్' సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన సంగీత్ శోభన్ ఇప్పుడు తన ప్రధాన పాత్రలో గ్లాంబ్లర్స్ అనే చిత్రంతో ప్రేక్షకులని పలకరించేందుకు సిద్ధమయ్యాడు. ఎప్పుడో విడుదల కావలసిన ఈ చిత్రాన్ని ఇప్పుడు థియేటర్స్‌లోకి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు. ప్రమోషన్స్ జోరుగా చేస్తూ సినిమాపై ఆసక్తిని పెంచుతున్నారు. నాలుగు రోజుల క్రితం టీజర్, ఫస్ట్ సాంగ్ ను రిలీజ్ చేసారు. తాజాగా ట్రైలర్ ను ఆవిష్కరించారు.'ఆడటం చేతగాని వాడికి జూదం అంటే నేరం అనిపిస్తుంది.. ఆడటం తెలిసిన వాడికి జూదం నేరం కాదు ' అంటూ ప్రారంభమైన ఈ ట్రైలర్ లో ఒక క్లబ్ లో జరిగే సన్నివేశాలను చూపించారు.

ఇందులో కొందరు వ్యక్తులు క్లబ్ లో గేమ్ ఆడటం, హీరో వాళ్ళతో ఏదో డీల్ సెట్ చేసుకోవడం, దాని వెనుక ఇంకేదో మిస్టరీ ఉందని అనుకునేలా ఈ ట్రైలర్ ఉంది. ఈ చిత్రంలో మిస్టరీతో పాటు ఎంటర్‌టైన్‌మెంట్ దండిగా ఉంటుందని అర్థమవుతుంది. మ్యాడ్, 'మ్యాడ్ స్క్వేర్' సినిమాల్లో కామెడీతో ఆకట్టుకున్న సంగీత్ శోభన్.. గ్యాంబ్లర్స్ అనే చిత్రంలో చాలా భిన్నమైన పాత్రలో కనిపించనున్నారు. కౌబాయ్ తరహా కాస్ట్యూమ్స్ లో కనిపించి ఆకట్టుకున్నారు. ప్రశాంతి చారులింగా, రాకింగ్ రాకేష్, పృథ్వీరాజ్, సాయి శ్వేత, జస్విక, భరణి శంకర్, మల్హోత్ర శివ, శివారెడ్డి, శ్రీకాంత్ అయ్యంగార్, మధుసూదన్ రావు తదితరులు ఈ చిత్రంలో ఇతర పాత్రలు పోషించారు.




ప్రముఖ రచయిత, దర్శకుడు విజయేంద్రప్రసాద్ దర్శకత్వంలో శ్రీవల్లి అనే సైన్స్ ఫిక్షన్ సినిమాను నిర్మించిన నిర్మాతలు సునీత, రాజ్‌కుమార్ బృందావనంలు రేష్మాస్ స్టూడియోస్, స్నాప్ అండ్ క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కేఎస్‌కే చైతన్య ఈ చిత్రానికి దర్శకుడు. పూర్తి వైవిధ్యమైన కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని రూపొందించగా, ఈ చిత్రం చిత్రం అన్ని వర్గాలను అలరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. జూన్ 6న చిత్రాన్ని విడుదల చేయనున్నారు. మరి ఈ సినిమా ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో చూడాలి.

## ఎంగేజ్‌మెంట్ ప్రచారంపై శ్రీలీల క్లారిటీ

### అసలు మ్యాటర్ ఏంటంటే..?

టాకీస్: యువ నటిగా టాలీవుడ్ సినిమాల్లో దూసుకెళ్తున్న శ్రీలీల ఇటీవల తన సోషల్ మీడియా పోస్టుల వల్ల వార్తలలో నిలిచారు. శుక్రవారం సాయంత్రం ఆమె ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో షేర్ చేసిన కొన్ని ఫొటోలు ఆమె నిశ్చితార్థ వేడుకగా భావిస్తూ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. ఈ ప్రచారానికి స్వయంగా శ్రీలీల స్పందిస్తూ స్పష్టతనిచ్చారు.

శ్రీలీల తాజా పోస్ట్‌లో ఆమె పసుపు రాసుకొని ట్రెడిషనల్ లుక్‌లో కనిపిస్తున్నారు. పెద్దవాళ్లు ఆమెకు పసుపు పూసి ఆశీర్వదిస్తున్నట్లు ఫొటోల్లో కనిపిస్తోంది. అంతేకాకుండా దీనికి 'బిగ్ డే, కమింగ్ సూన్' అని శ్రీలీల క్యాప్షన్ పెట్టారు. తన ఇంట్లో జరిగిన ఓ ప్రత్యేక వేడుకలో భాగంగా ఫ్యామిలీ మెంబర్స్‌తో కలిసి ఉన్న ఫొటోలు షేర్ చేశారు. దీంతో ఈ పుకార్లు జోరందుకున్నాయి. ఇది ఆమె హల్దీ ఈవెంట్ అని, త్వరలోనే పెళ్లి చేసుకోనున్నారంటూ కథనాలు వస్తున్నాయి. కానీ, ఈ ఊహాగానాలకు శ్రీలీల వెంటనే స్పందించారు. ఈ ఫొటోలన్నీ ఆమె ముందస్తు పుట్టినరోజు వేడుకలకు సంబంధించినవి అని క్లారిటీ ఇచ్చారు. ప్రీ బర్త్‌డే వేడుకలను తమ ఇంట్లోనే ఈ విధంగా సెలబ్రేట్ చేసుకున్నట్లు చెప్పారు. ఈ వేడుకకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను వాళ్ల అమ్మే స్వయంగా చూసుకున్నట్లు అని ఆమె స్పష్టం చేశారు. ఈ వేడుకల్లో నటుడు రానా దాగ్గుబాటి భార్య మిహిక కూడా పాల్గొనడం విశేషం. చీరకట్టులో సంప్రదాయబద్ధంగా శ్రీలీల కనిపించారు.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.